సాక్షి మహబూబాబాద్

శనివారం । 1 । జూలై । 2023



నకిలీ మావోయిస్టుల అరెస్ట్

మావోయిస్టుల పేరిట లెటర్‌ప్యాడ్ సృష్టించి డబ్బులు డిమాండ్ చేసిన నలుగురు నకిలీ మావోయిస్టులను పోలీసులు అరెస్ట్ చేశారు.

- IIలో ▸



కాజీపేటలో డీఆర్ఎం తనిఖీలు

ఈనెల 8న ప్రధాని మోదీ కాజీపేటకు రానున్న నేపథ్యంలో శుక్రవారం డీఆర్ఎం గుప్తా కాజీపేట జంక్షన్‌ను పరిశీలించారు.

- IIలో ▸

గరిష్టం/కనిష్టం
35.4^0 / 26.5^0

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం ఎండతో పాటు ఉక్కపోతగా ఉంటుంది. పలుచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

వ్యవసాయ చట్టాలపై అవగాహన అవసరం



తొర్రూరు రూరల్: వ్యవసాయ చట్టాలపై రైతులు అవగాహన కలిగి ఉండాలని తొర్రూరు సివిల్ కోర్టు జడ్జి సరిత అన్నారు. శుక్రవారం మండలంలోని అరిపిరాల గ్రామంలో వ్యవసాయ చట్టాలపై మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జడ్జి సరిత మాట్లాడుతూ.. కోర్టుల ద్వారా అందిస్తున్న న్యాయ సేవలను అన్నివర్గాల రైతులు సద్వినియోగం చేసుకోవాలని, ప్రతి రైతు వ్యవసాయ పంటల సాగు, సంబంధిత చట్టాలు, హక్కులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వల్లపు గోపమ్మ, బార్ అసోసియేషన్ ప్రతినిధులు నాగేశ్వర్, వల్లపు మహేష్, మధుసూదన్, ఐలోనీ, అశోక్, కృపావతి, గౌస్, ఏఈఓ అరవింద్, రైతులు పాల్గొన్నారు.

పోరాటల ఫలితంగానే పోడుపట్టాల పంపిణీ

నెహ్రూసెంటర్: అనేక పోరాటాల ఫలితంగానే ప్రభుత్వం పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని సీపీఐ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి శుక్రవారం అన్నారు. పోడు సాగుదారులతో కలిసి వంద నాగళ్లతో పోడు భూములను దున్ని రైతుల పక్షాన ఉద్యమించినట్లు వివరించారు. పోడుభూముల పోరాటంలో నాయకులు జైలుకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయని గుర్తు చేశారు. ప్రభుత్వం పెట్టిన కేసుల్లో భాగంగా సీపీఐ నేతలు చాడ వెంకట్‌రెడ్డి, తక్కెళ్లపల్లి శ్రీనివాసరావు, అజయ్‌సారథిరెడ్డి, విశ్వేశ్వర్‌రావు, తోట భిక్షపతి ఇప్పటికీ కోర్టులకు తిరుగుతున్నామని తెలిపారు. పోడు రైతుల పక్షాన ఎంసీపీఐయూ పార్టీ అనేక పోరాటాలు నిర్వహించిందని పార్టీ జిల్లా కార్యదర్శి కంచ వెంకన్న అన్నారు. గిరిజన ప్రాంతాల్లో పోడు భూములకు హక్కులు కల్పించాలని పోరాటాలు చేశామని అన్నారు.

నరేష్‌రెడ్డి ఇంట్లో ఆతిథ్యం స్వీకరించిన మంత్రి



మరిపెడ రూరల్: జిల్లా కేంద్రంలో గిరిజనులకు పోడు పట్టాలు అందజేసి హైదరాబాద్ వెళ్తున్న మంత్రి కేటీఆర్ మార్గమధ్యలో మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెంలోని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేష్‌రెడ్డి ఇంటికి వెళ్లారు. అక్కడ నరేష్‌రెడ్డి ఆయన తనయుడు నూకల అభినవ్‌రెడ్డి ఇచ్చిన ఆతిథ్యం స్వీకరించి అరగంట పాటు మంత్రి సేద తీరారు. అనంతరం అక్కడి నుంచి కేటీఆర్ హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు. కేటీఆర్ వెంట మంత్రులు సత్యవతిరాథోడ్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎంపీ మాలోతు కవిత, ఎమ్మెల్యేలు బానోతు శంకర్‌నాయక్, హరిప్రియ, ఆరూరి రమేష్, నన్నపునేని నరేందర్, చల్లా ధర్మారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆంగోతు బిందు, మానుకోట మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, గూడూరు జెడ్పీటీసీ సుచిత్ర, స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

తిర్మలాపురం వాసి అరుణ్‌కు 'ఏసీపీ'గా పదోన్నతి



కురవి: మండలంలోని తిర్మలాపురం గ్రామానికి చెందిన పుప్పాల అరుణ్‌కు నిజామాబాద్ ఏసీపీగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఆయన శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన పుప్పాల భిక్షమయ్య–జ్యోతిల కుమారుడు అరుణ్‌కు 2007లో ఏఆర్ ఎస్సై ఉద్యోగం రాగా.. హైదరాబాద్‌లో సెక్యూరిటీ వింగ్, పోలీస్‌అకాడమీలో విధులు నిర్వహించారు. 2016లో రిజర్వు ఇన్‌స్పెక్టర్(సీఐ)గా పదోన్నతి పొంది వరంగల్ రూరల్, మహబూబాబాద్, భూపాలపల్లిలో విధులు నిర్వహించారు. ఇప్పటివరకు సైబరాబాద్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. కాగా ప్రస్తుతం నిజామాబాద్ కమిషనరేట్‌లో ఏసీపీగా పోస్టింగ్ ఇచ్చినట్లు ఆయన వివరించారు. ఈ మేరకు సైబరాబాద్ పోలీస్ కమిషనర్ స్టీఫెన్‌రవీంద్రను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చినట్లు ఆయన వివరించారు. కాగా అరుణ్‌కు ఏసీపీగా పదోన్నతి రావడంతో గ్రామస్తులతో పాటు స్నేహితులు అభినందనలు తెలిపారు.

అభివృద్ధి వివరిస్తూ..

ఆదరించాలని కోరుతూ..

మానుకోటలో సాగిన మంత్రి కేటీఆర్ పర్యటన

- పలు అభివృద్ధి పనుల శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు
- కూరగాయల వ్యాపారులు, డబుల్ బెడ్రూం ఇళ్ల లబ్ధిదారులతో మాటామంతి
- గిరిజనులకు పట్టాలు ఇచ్చినందుకు గర్వంగా ఉందన్న మంత్రి సత్యవతి
- జిల్లా కావడం ఇక్కడి ప్రజల అదృష్టమన్న మంత్రి దయాకర్‌రావు



బహిరంగ సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యేలు తదితరులు



లబ్ధిదారురాలికి పోడు భూముల పట్టా అందజేస్తున్న మంత్రులు కేటీఆర్, దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎంపీ కవిత, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ తదితరులు

సాక్షి, మహబూబాబాద్/మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో శుక్రవారం రాష్ట్ర ఐటీ, పురపాలకశాఖ మంత్రి కల్వకుంట్ల తారకరామారావు పర్యటించారు. పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. పోడు రైతులకు పట్టాలు అందజేశారు. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధిని వివరిస్తూ.. మరోసారి ఆదరించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఉదయం మానుకోటకు చేరుకున్న మంత్రి కేటీఆర్‌కు ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు, మహిళలు బతుకమ్మలతో తరలివచ్చి డప్పుచప్పుళ్ల మధ్య ఘన స్వాగతం పలికారు.

పైలాన్ ఆవిష్కరణ..

ఉదయం 11.55 గంటలకు మానుకోటకు చేరుకున్న మంత్రి ముందుగా సీఎం కేసీఆర్ మున్సిపాలిటీకి మంజూరు చేసిన రూ.50కోట్లతో చేపట్టే పనుల వివరాలతో ఏర్పాటు చేసిన పైలాన్‌ను ఆవిష్కరించారు. తహసీల్ ఎదుట ఈ పైలాన్ ఆవిష్కరణ సందర్భంగా జనాలు ఒక్కసారిగా ముందుకు రావడం, తోపులాట జరగడంతో వీఐపీలు ఇబ్బందులు పడ్డారు. 12.04 గంటలకు రూ.6కోట్ల వ్యయంతో నిర్మించిన వెజ్, నాన్‌వెజ్ మార్కెట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా కూరగాయలు అమ్ముతున్న ద్వాలీ, అత్తకూరు రమాదేవితో మంత్రి మాట్లాడారు. కుటుంబ పరిస్థితులు, ప్రభుత్వ పథకాలు అందుతున్న తీరును చర్చించారు. అక్కడే సెర్ప్ ఉద్యోగులు మంత్రికి వినతిపత్రం అందజేశారు.

పట్టాల పంపిణీ..

డబుల్ బెడ్రూం ఇళ్ల నుంచి 12.43 గంటలకు నేరుగా మంత్రి.. ఎన్‌టీఆర్ స్టేడియానికి చేరుకున్నారు. స్టాల్స్‌ను పరిశీలించారు. 1.27 గంటలకు సభా వేదికకు చేరుకొని పోడు రైతులకు పట్టాలు అందజేశారు. మధ్యాహ్నం 1.51 గంటల వరకు అంటే 24 నిమిషాల పాటు ప్రసంగించారు.

వీటిని ప్రారంభించకుండానే..

ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో వివేకానంద సెంటర్ నుంచి రూ.5కోట్లతో నిర్మాణం చేయనున్న రోడ్డు వెడల్పు, సెంట్రల్ లైటింగ్ పనుల శంకుస్థాపన కోసం శిలాఫలకంతో పాటు ఇతరత్రా ఏర్పాట్లు చేయగా మంత్రి శంకుస్థాపన చేయలేదు.

వరాల జల్లు కురిపించని మంత్రి

జిల్లాలో శుక్రవారం మంత్రి కేటీఆర్ పర్యటన స్థానికులను నిరాశపర్చిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. సభలో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ కేసముద్రాన్ని మున్సిపాలిటీ చేయాలని, అగ్నిమాపక కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై మంత్రి స్పందించకపోగా మానుకోటకు ఎటువంటి వరాలు కురిపించకపోవడంతో ప్రజలు నిరాశ చెందారు. ఎంపీ మాలోత్ కవిత మాట్లాడుతూ గతంలో తాను కాంగ్రెస్‌లో పని చేసిన సమయంలో రూ.5కోట్ల నిధుల కోసం చాలా కష్టాలు పడ్డామన్నారు. కేటీఆర్ తన ప్రసంగంలో ఆ విషయంపై మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలో ఆ పరిస్థితి ఉందని, సీఎం కేసీఆర్ మానుకోటకు వచ్చిన సమయంలో అడుగకుండానే రూ. 50 కోట్లు కేటాయించారని.. వరాల విషయంలో దాట వేసే ధోరణితో మాట్లాడారు. మున్సిపల్‌శాఖ మంత్రిగా ఏమైనా ప్రకటిస్తారని ఆశించిన వారికి నిరాశే ఎదురైందని స్థానిక నాయకత్వం భావిస్తోంది. కార్యక్రమంలో శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవీందర్‌రావు, బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యేలు శంకర్‌నాయక్, రెడ్యానాయక్, హరిప్రియ, అరూరి రమేష్, నరేందర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్, గిరిజన సంక్షేమ ప్రత్యేక కార్యదర్శి శ్రీధర్, కలెక్టర్ శశాంక, ఐటీడీఏ పీఓ అంకిత్, ఎస్పీ శరత్ చంద్ర పవార్, జెడ్పీ చైర్‌పర్సన్లు గండ్రజ్యోతి, ఆంగోతు బిందు, రైతు రుణ విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగుర్ల వెంకన్న, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, భీరవెల్లి భరత్ కుమార్‌రెడ్డి, బాలాజీ నాయక్, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఆస్పత్రి రూపురేఖలు మారాయి: మంత్రి కేటీఆర్

మానుకోట జిల్లా ఆస్పత్రి రూపురేఖలు మారాయని.. 'రాష్ట్రంలో నేను రాను బిడ్డో సర్కారు దవాఖానాకు అన్న రోజులనుంచి.. సర్కారు దవాఖానాకే వెళ్తాను అనే రోజులు వచ్చాయి'అని మంత్రి కేటీఆర్ అన్నారు. పదిమంది డాక్టర్లు లేని ఆస్పత్రిలో 140 మంది డాక్టర్లు పనిచేస్తూ వైద్య సేవలు అదించడం ఇక్కడి ప్రజలకు ప్రభుత్వం చేస్తున్న సేవలకు నిదర్శనమన్నారు. తెలంగాణ వస్తే ఏం వస్తుందని అడిగిన వాళ్లకు ఇదే మా సమాధానం అన్నారు. మధ్యమధ్యలో పిట్టకథలు, జై తెలంగాణ నినాదాలు, కేసీఆర్ చేసిన అభివృద్ధి, సాధించిన విజయాలు చెబుతూ ప్రజలను ఉత్తేజపరిచారు. బీజేపీ చేసిన మోసం, కాంగ్రెస్ నాయకులు మాయ మాటలు చెబుతూ ప్రజల్లోకి వస్తున్న పరిస్థితిని వివరించారు. వారిని నమ్మవద్దని, వారికి మద్దతు ఇస్తే ఆగమవుతారన్నారు. మళ్లీ బీఆర్ఎస్ పార్టీకే ఓటు వేయాలని, ప్రభుత్వాన్ని నిలబెట్టాలని చెప్పకనే చెప్పారు. చివరలో జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని నినాదాలు, సభకు వచ్చిన వారితోపాటు, అతిథులకు భోజనాల ఏర్పాటులో తోపులాట జరగడం కొసమెరుపు. అదేవిధంగా డిగ్రీ కళాశాల నుంచి బయటకు వెళ్తున్న కేటీఆర్‌కు అంగన్‌వాడీ టీచర్లు వినతిపత్రాలు అందజేశారు.



కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న మంత్రి



సభకు హాజరైన కార్యకర్తలు, నాయకులు, ప్రజలు

'డబుల్' ఇళ్ల ప్రారంభం..

మధ్యాహ్నం 12.28నుంచి 12.36 వరకు : మానుకోటలోని రాంచంద్రాపురం కాలనీలో నిర్మించిన 200 డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించి, గృహప్రవేశాలు చేయించారు. ఇంటి యజమాని పిల్లి విజయ మంత్రులను ఇంట్లోకి ఆహ్వానించారు. ఇంట్లో మంచానికి పరిమితమైన విజయ భర్త శ్రీను ఆరోగ్య పరిస్థితిని మంత్రి అడిగి తెలుసుకున్నారు. వారికి ఇంటి పట్టా అందజేశారు. పక్కనే రమ ఇంటికి వెళ్లి కొబ్బరికాయ కొట్టి గృహప్రవేశం చేయించారు. కేసీఆర్ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు.



మంత్రులను ఇంట్లోకి స్వాగతిస్తున్న డబుల్ బెడ్రూం ఇంటి లబ్ధిదారులు

> **ఇక్కడి ప్రజల అదృష్టం: మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు**
>
> 
>
> కలలో కూడా ఊహించని విధంగా మహబూబాబాద్ జిల్లాగా ఏర్పడిందని, అంతటితో ఆగకుండా ప్రభుత్వ మెడికల్ కళాశాల, ఆస్పత్రి ఏర్పాటు, ఇంజనీరింగ్ కాలేజీ రావడం ఇక్కడి ప్రజల అదృష్టమని మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని కోరారు.
>
> **సీఎంకు రుణపడి ఉంటా: మంత్రి సత్యవతిరాథోడ్**
>
> 
>
> సాధారణ కుటుంబంలో పుట్టిన తనకు సీఎం కేసీఆర్ మంత్రి పదవి ఇచ్చారని, ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానని మంత్రి సత్యవతిరాథోడ్ అన్నారు. మంత్రి కేటీఆర్ ఆధ్వర్యంలో గిరిజనుల పోడు పట్టాల పంపిణీ కార్యక్రమంలో తాను పాల్గొన్నందుకు గర్వంగా ఉందన్నారు. మంత్రి లంబాడీ భాషలో ప్రసంగిస్తూ.. గిరిజనులకు అర్థమయ్యేలా రాష్ట్ర పథకాలను వివరించారు.
>
> **తొమ్మిది సంవత్సరాల్లో ఎంతో అభివృద్ధి: ఎంపీ కవిత**
>
> 
>
> స్వాతంత్ర్యం వచ్చిన డెబ్బై ఏళ్లలో జరగని అభివృద్ధి తొమ్మిదేళ్లలో జరిగిందని మానుకోట ఎంపీ మాలోత్ కవిత అన్నారు. పల్లెలు, పట్టణాల్లో అన్ని సౌకర్యాలు మెరుగపడ్డాయన్నారు.
>
> **పట్టణ రూపురేఖలు మారాయి: ఎమ్మెల్యే శంకర్‌నాయక్**
>
> 
>
> తెలంగాణ రాష్ట్రం వచ్చిన తర్వాత ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆశీస్సులతో మానుకోట పట్టణ రూపురేఖలు మారాయని స్థానిక ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ అన్నారు. పట్టణాన్ని అందంగా సుందరీకరించామని చెప్పారు.

గరంగరంగా.. కేటీఆర్

- ఆద్యంతం కోపంగానే కనిపించిన మంత్రి
- ముఖంపై కనిపించని చిరునవ్వు.. సభావేదికపైన ముభావంగానే..
- కేటీఆర్ తీరుపై రకరకాల చర్చ

- IIలో ▸

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ

- ములుగు ఎమ్మెల్యే సీతక్క



మాట్లాడుతున్న ములుగు ఎమ్మెల్యే సీతక్క

కొత్తగూడ: రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ టీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేస్తోందని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. శుక్రవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. జిల్లాల్లో మంత్రులు పర్యటిస్తే ప్రతిపక్ష, ప్రజా సంఘాల నాయకులను అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. పోడు సాగు చేసుకుంటున్న ఆదివాసీ, గిరిజనులతో పాటు నిరుపేదలకు పోడు పట్టాల ఇవ్వాలని అసెంబ్లీ సాక్షిగా పోరాటం చేసింది కాంగ్రెస్ పార్టీ అన్నారు. పోరాటాలకు తలొగ్గి పట్టాలు ఇస్తున్నారని, అందుకు ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రభుత్వ కార్యక్రమాలను పార్టీ ప్రచారానికి వినియోగించుకుంటున్నారని విమర్శించారు. పట్టాలు ఇవ్వడంతో పాలు ఫారెస్ట్ అధికారుల నుంచి ఎలాంటి ఆంక్షలు లేకుండా స్వేచ్ఛాయుత వ్యవసాయం చేసుకునే అవకాశం కల్పించాలని కోరారు. ఇప్పటి వరకు పోడుదారులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చల్లా నారాయణరెడ్డి, వజ్జ సారయ్య, సయ్యద్, సారంగం తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆదరణ కోల్పోతున్న బీఆర్ఎస్

- కేంద్ర మాజీ మంత్రి బలరాం నాయక్ హౌస్ అరెస్టు



బలరాంనాయక్‌ను హౌస్ అరెస్టు చేసిన పోలీసులు

మహబూబాబాద్ రూరల్: మంత్రి కేటీఆర్ పర్యటనతో మానుకోటకు ఒరిగేదేముందని, ప్రజల ఆదరణ కోల్పోతున్నామనే ప్రగతిభవన్ నుంచి జిల్లాలకు వస్తున్నారని కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాం నాయక్ అన్నారు. శుక్రవారం కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బలరాంనాయక్‌ను జిల్లా కేంద్రంలోని తన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్‌ను రక్షించేందుకే మంత్రి కేటీఆర్ పర్యటన చేశారని అన్నారు. పాత పనులకు మోక్షం లేదని, కొత్తగా ఏం చేస్తారని మండిపడ్డారు. కేటీఆర్ వస్తే ముందస్తు అరెస్టులు చేయడం సరికాదన్నారు. మహబూబాబాద్‌లో అనేక సమస్యలు ఉన్నాయని, వాటిని పరిష్కరించాలని ప్రశ్నించినందుకు భయంతోనే ముందస్తుగా అర్థం లేని అరెస్టులు చేస్తున్నారని మండిపడ్డారు. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కేసముద్రం మున్సిపాలిటీ హామీలపై కేటీఆర్ తప్పకుండా స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు.

భూనిర్వాసితులకు పరిహారం చెల్లించాలి

గార్ల: సీతారామ సాగునీటి ప్రాజెక్ట్ భూనిర్వాసితులకు వెంటనే పరిహారం చెల్లించాలని కోరుతూ శుక్రవారం ఎంపీడీఓ రవీందర్, ఎంపీపీ శివాజీ చౌహాన్‌కు భూనిర్వాసితులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కందునూరి శ్రీనివాసరావు మాట్లాడారు. ప్రాజెక్ట్ కాలువ నిర్మాణ పనులు ప్రారంభమై ఏడాది గడుస్తున్నా నేటికీ భూనిర్వాసితులకు పరిహారం చెల్లించడంలో అధికారులు వైఫల్యం చెందారని ఆరోపించారు. వినతిపత్రం అందించిన వారిలో భూనిర్వాసితులు బాగం లోకేశ్వరరావు, భూక్య నంద్యా పాల్గొన్నారు.

గ్రూప్–4 పరీక్షకు సర్వం సిద్ధం

- కలెక్టర్ శశాంక

మహబూబాబాద్: జిల్లాలో శనివారం నిర్వహించే గ్రూప్–4 పరీక్షకు సర్వం సిద్ధం చేసినట్లు కలెక్టర్ శశాంక శుక్రవారం తెలిపారు. జిల్లాలో 14,207 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని, అందుకు 46 కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అభ్యర్థులు ఒరిజినల్ హాల్ టికెట్‌తో పాటు ఏదైనా ప్రభుత్వం జారీ చేసిన గుర్తింపుకార్డు వెంట తెచ్చుకోవాలన్నారు. అభ్యర్థులు ఉదయం 8గంటల వరకు కేంద్రాలకు చేరుకునే విధంగా ఆర్టీసీ అధికారులు బస్సులు నడపాలని ఆదేశించారు. ఉదయం 9.45 గంటల వరకు, మధ్యాహ్నం 2.15గంటల వరకే సెంటర్‌లోకి అనుమతి ఉంటుందన్నారు. అభ్యర్థులు బూట్లు లేకుండా రావాలన్నారు. సెల్‌ఫోన్, ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదన్నారు. పరీక్ష నిర్వహణకు జిల్లాలో 9రూట్లుగా విభజించి 18 రూట్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు.



దోర్నకల్ నిర్మలా స్కూల్‌లో ఏర్పాట్ల పరిశీలన

గ్రూప్–4 పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

దోర్నకల్: దోర్నకల్‌లో శనివారం జరగనున్న గ్రూప్–4 పరీక్షకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రిలియంట్ హైస్కూల్‌లో 288 మంది, సెయింట్ ఆగ్నెస్ హైస్కూల్‌లో 360మంది, నిర్మలా హైస్కూల్‌లో 240మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారు. ఉదయం 10గంటల నుంచి 12.30గంటల వరకు మొదటి పేపర్, మధ్యాహ్నం 2.30గంటల నుంచి సాయంత్రం 5గంటలకు రెండో పేపర్ పరీక్ష జరగనుంది. అభ్యర్థులు మొదటి పేపర్‌కు ఉదయం 9.45గంటల లోపు, రెండో పేపర్‌కు మధ్యాహ్నం 2.15గంటల లోపు పరీక్ష కేంద్రాల్లోకి వెళ్లాలని అధికారులు సూచించారు.

ప్రత్యేక బస్సులు

నెహ్రూసెంటర్: గ్రూపు 4 పరీక్ష రాస్తున్న అభ్యర్థుల సౌకర్యార్థం మానుకోట డిపో నుంచి 7ప్రత్యేక బస్సులను నడపనున్నట్లు ఆర్టీసీ డీఎం జె.విజయ్ శుక్రవారం తెలిపారు. డిపో నుంచి సూర్యాపేట, నర్సంపేట, తొర్రూరు, నెక్కొండ, వరంగల్, ఖమ్మం వైపునకు ఉదయం 6 గంటల నుంచి ప్రతీ 30నిమిషాలకు ఒక బస్సు అందుబాటులో ఉంటుందన్నారు. అదేవిధంగా బయ్యారం, ఇల్లెందు వెపు, దోర్నకల్, దంతాలపల్లి వైపు కూడా ఉదయం బస్సు సౌకర్యం ఉందన్నారు. పరీక్ష పూర్తయిన తర్వాత తిరుగుప్రయాణంలో బస్సు సౌకర్యం కల్పించామన్నారు.

విస్తృత పోలీసు బందోబస్తు

మహబూబాబాద్ రూరల్: జిల్లాలో మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో శుక్రవారం విస్తృత పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పట్టణంలో పోలీసులు జల్లెడ పట్టారు. రైల్వే స్టేషన్, ప్రధాన వీధులు, ఆర్టీసీ బస్టాండ్, ఇతర అనుమానాస్పద ప్రాంతాల్లో పోలీసులు తనిఖీలు చేశారు. ఎస్పీ శరత్ చంద్రపవార్ భద్రత చర్యలపై పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా పోలీస్ యంత్రాంగం వాహన తనిఖీలు చేపట్టారు. మంత్రి పర్యటించే ప్రాంతాల్లో బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ బృందాలతో తనిఖీలు చేశారు.



పోలీసు అధికారులకు సూచనలు చేస్తున్న ఎస్పీ

తహసీల్దార్ కార్యాలయానికి తాళం



తాళం వేస్తున్న ఇంటి యజమాని వెంకన్న

దంతాలపల్లి: అద్దెతో పాటు విద్యుత్ బిల్లు చెల్లించలేదని మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయానికి ఇంటి యజమాని తాళం వేసిన ఘటన శుక్రవారం జరిగింది. యజమాని చలగోల వెంకన్న మాట్లాడుతూ.. 2016లో తమ ఇంటిని తహసీల్దార్ కార్యాలయానికి రెవెన్యూ అధికారులు అద్దెకు తీసుకున్నట్లు తెలిపారు. నెలకు రూ.3,750 అద్దె చెల్లిస్తామని ఒప్పందం చేసుకున్నట్లు చెప్పారు. అయితే 2022 జూన్ నుంచి 2023 జూన్ వరకు అద్దె చెల్లించకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. అలాగే విద్యుత్ బకాయి రూ.లక్ష ఉందని, బిల్లు చెల్లించకపోవడంతో బకాయి పెరుగుతుందన్నారు. దీంతో విసుగెత్తి కార్యాలయానికి తాళం వేసినట్లు వెంకన్న వివరించారు. చివరకు తహసీల్దార్ శివాని ఇంటి యజమానితో మాట్లాడి తాళం తీయించారు. అనంతరం కార్యాలయంలో ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగాయి.

ఎస్పీని కలిసిన ఏఆర్ డీఎస్పీ

మహబూబాబాద్ రూరల్: ఎస్పీ శరత్‌చంద్ర పవార్‌ను డీఎస్పీగా పదోన్నతి పొందిన నర్సయ్య (ప్రస్తుత ఏఆర్ ఆర్ఐ) శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి నర్సయ్య బొకే అందజేయగా ఆయన అభినందనలు తెలిపారు. నర్సయ్య 2007 బ్యాచ్ ఏఆర్ఎస్సైగా ఉద్యోగంలో చేరి కొత్తగూడెం, ఖమ్మంలో విధులు నిర్వహించారు. 2016లో ఆర్ఐగా పదోన్నతి పొంది వరంగల్ రూరల్, మహబూబాబాద్ జిల్లాల్లో విధులు నిర్వహించారు. ప్రస్తుతం డీఎస్పీగా పదోన్నతి పొంది ఖమ్మం పోలీస్ కమిషనరేట్‌లో డీఎస్పీగా విధులు నిర్వహించనున్నారు.

గరంగరంగా.. కేటీఆర్‌

- ఆద్యంతం కోపంగా కనిపించిన మంత్రి
- ముఖంపై కనిపించని చిరునవ్వు.. సభావేదికపైన ముభావంగానే
- కేటీఆర్‌ తీరుపై రకరకాల చర్చ


ఎమ్మెల్యే శంకర్‌ నాయక్‌ చేయిని విసురుగా తీసివేస్తున్న మంత్రి కేటీఆర్‌


వరంగల్‌ తూర్పు ఎమ్మెల్యే నరేందర్‌ ఇస్తున్న పూలబొకేను తిరస్కరిస్తున్న మంత్రి కేటీఆర్‌

సాక్షి, మహబూబాబాద్‌: మానుకోట పర్యటనలో రాష్ట్ర ఐటీ మంత్రి కేటీఆర్‌ వ్యవహార శైలి సహజత్వానికి భిన్నంగా కనిపించింది. మంత్రి ఏ జిల్లాకు వెళ్లినా అందరినీ ఆప్యాయంగా పలకరిస్తూ నవ్వుకుంటూ కార్యక్రమాల్లో పాల్గొంటారు. కానీ శుక్రవారం మహబూబాబాద్‌లో మాత్రం కొంత గరంగరంగా ఉన్నట్లు జిల్లాలో చర్చ జరుగుతోంది. దీనిపై కూడా సోషల్‌ మీడియాలో విస్తృత చర్చ నడిచింది. హైదరాబాద్‌ నుంచి బయల్దేరిన మంత్రి జనగామ, తొర్రూర్‌ మీదుగా మహబూబాబాద్‌కు చేరుకుంటారని భావించారు. అలా కాకుండా నకిరేకల్‌.. అర్వపల్లి..తానంచెర్ల మీదుగా మహబూబాబాద్‌ వచ్చారు. డోర్నకల్‌ ఎమ్మెల్యే రెడ్యానాయక్‌, మానుకోట ఎంపీ కవిత మరిపెడలో మంత్రిని ఆపి టీ బ్రేక్‌కు ఆహ్వానించే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. దానిని సున్నితంగా తిరస్కరించిన కేటీఆర్‌ అక్కడి నుంచి మహబూబాబాద్‌ వైపు వచ్చారు. ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ మహబూబాబాద్‌ సరిహద్దు సలార్‌ తండా వద్ద స్వాగతం పలికి తమ క్యాంపు ఆఫీస్‌కు తీసుకెళ్లాలని కోరినట్లు తెలిసింది. ఇక్కడ కూడా తిరస్కరించిన కేటీఆర్‌ నేరుగా మంత్రి సత్యవతిరాథోడ్‌ ఇంటికి వెళ్లి అందరిని ఆశ్చర్యపరిచారు. తన ఇంటికి కేటీఆర్‌ వస్తున్న విషయం మంత్రికి కూడా తెలియకపోవడంతో హుటాహుటిన ఆమె వెళ్లి మంత్రిని ఇంట్లోకి ఆహ్వానించారు.

ఎమ్మెల్యే చేయి పట్టుకోబోగా..

తహసీల్దార్‌ కార్యాలయం వద్ద పైలాన్‌ ఆవిష్కరణలో జరిగిన తోపులాట కేటీఆర్‌ను ఇబ్బంది పెట్టింది. అక్కడినుంచి డబుల్‌బెడ్రూం ఇళ్ల వద్దకు వెళ్లిన సందర్భంలో పూలతో స్వాగతం పలికే దారి కాకుండా కేటీఆర్‌ వేరే దారిన వెళ్తుండగా అటుగా వెళ్దామని ఎమ్మెల్యే శంకర్‌ నాయక్‌ చేయి పట్టుకోగా.. కేటీఆర్‌ ఒకింత విసురుగా శంకర్‌ నాయక్‌ చేయిని తీసివేశాడు. ఈ వీడియో కూడా సోషల్‌ మీడియాలో వైరల్‌గా మారింది. అదేవిధంగా సభా వేదిక వద్ద వరంగల్‌ తూర్పు ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్‌ పుష్పగుచ్ఛం ఇస్తుంటే తిరస్కరించిన తీరును బట్టి మంత్రి ఆగ్రహంగా ఉన్న విషయం కొట్టొచ్చినట్లు కనిపించింది. సభావేదికపై కూడా ఎలాంటి చిరునవ్వు చిందించకుండా ముభావంగా కనిపించారు. ఇటీవల జరిగిన ప్రతి సభల్లో స్థానికంగా ఉన్న ఎమ్మెల్యేలను చూపిస్తూ భారీ మెజార్టీతో గెలిపించాలని చెబుతూ వచ్చారు. కానీ మహబూబాబాద్‌లో మాత్రం నాయకులను పరిచయం చేయడం కానీ, వారికి ఓటేసి గెలిపించాలనే ప్రస్తావన కూడా తేలేదు. ఇళ్ల స్థలాలు ఇవ్వాలని జర్నలిస్టులు నినాదాలు చేయగా.. పెద్దగా పట్టించుకోకుండా వారివైపు ఆగ్రహంగా చూస్తూ వెళ్లిపోయారు. ఇన్ని సంఘటనల నేపథ్యంలో కేటీఆర్‌ ఆగ్రహంగా ఉన్నారని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు.

ఎందుకిలా వ్యవహరించారు..?

సహజంగా ఉండే కేటీఆర్‌ ఈ శుక్రవారం ఎందుకు ఇలా వ్యవహరించారనే దానిపై రకరకాల చర్చ జరుగుతోంది. ఇటీవల జరిగిన సర్వేలో మానుకోటలో జిల్లాలోని డోర్నకల్‌, మహబూబాబాద్‌ నియోజకవర్గాల్లో బీఆర్‌ఎస్‌ పార్టీకి సానుకూల వాతావరణం లేదనే విషయం ప్రచారమవుతున్న నేపథ్యంలో జిల్లాలో మంత్రి పర్యటనలో చోటు చేసుకున్న సంఘటనలపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పార్టీలో యువరాజుగా ఉంటూ రేపు జరిగే ఎన్నికల టికెట్ల కేటాయింపులో కీలకభూమిక పోషించే కేటీఆర్‌ కోపానికి కారణం ఏమైఉంటుందోనని స్థానికంగా చర్చించుకుంటున్నారు.

5 లక్షల మందితో ప్రధాని బహిరంగ సభ


కాజీపేట: విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న గుజ్జుల ప్రేమేందర్‌ రెడ్డి


వరంగల్‌ చౌరస్తా: గ్రౌండ్‌ పరిశీలిస్తున్న నాయకులు

- బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

హన్మకొండ: 5లక్షల మందితో ఓరుగల్లులో నిర్వహించే ప్రధాని మోదీ బహిరంగ సభను విజయవంతం చేయాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌ రెడ్డి ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం హనుమకొండ హంటర్‌ రోడ్డులోని వేద బాంక్వెట్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ప్రేమేందర్‌ రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి వరంగల్‌ జిల్లా, వరంగల్‌ నగర అభివృద్ధికి మోదీ ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు విడుదల చేసిందన్నారు. వరంగల్‌ నగర అభివృద్ధి కోసం స్మార్ట్‌ సిటీ, అమృత్‌, హృదయ్‌ వంటి పథకాలు అమలు చేసిందని చెప్పారు. ఈ క్రమంలో కాజీపేటలో వ్యాగన్‌ తయారీ పరిశ్రమ, వ్యాగన్‌ పీరియాడికల్‌ ఓవరాయిలింగ్‌ యూనిట్‌కు జూలై 8న ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. ప్రధాన మోదీ రాక సందర్భంగా వరంగల్‌ మహానగరంలో 5లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సభ నిర్వహణకు హనుమకొండ సుబేదారిలోని ఆర్ట్స్‌ అండ్‌ సైన్స్‌ కళాశాల మైదానం, వరంగల్‌లోని ఓ సిటీ మైదానాన్ని పరిశీలించి ప్రతిపాదనలు ఢిల్లీకి పంపినట్లు వెల్లడించారు. సమావేశంలో బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ, వరంగల్‌ జిల్లా అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌, జిల్లా ఇన్‌చార్జ్‌ వి.మురళీధర్‌ గౌడ్‌, నాయకులు మార్తినేని ధర్మారావు, చందుపట్ల కీర్తిరెడ్డి, ఎర్రబెల్లి ప్రదీప్‌ రావు, వన్నాల శ్రీరాములు, ఎడ్ల అశోక్‌ రెడ్డి, కోరబోయిన సాంబయ్య, దేశిని సదానందం, జయంత్‌లాల్‌ పాల్గొన్నారు.

బహిరంగ సభకు స్థల పరిశీలన

వరంగల్‌ చౌరస్తా: ప్రధాని మోదీ పర్యటనలో భాగంగా ఈనెల 8న వరంగల్‌ అజంజాహి మిల్లు గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ నిర్వహణకు బీజేపీ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. కాజీపేట రైల్వే కోస్ట్‌ ఫ్యాక్టరీ, టెక్స్‌టైల్‌ పార్క్‌ శంకుస్థాపన అనంతరం భారీ బహిరంగ సభలో పాల్గొంటారని బీజేపీ నాయకులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం అజంజాహి మిల్స్‌ గ్రౌండ్‌ను గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌ రావు, నాయకులు పరిశీలించారు.

హత్య కేసులో పలువురి రిమాండ్‌

బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రిటైర్డ్‌ ఎంపీడీఓ నల్ల రామకృష్ణయ్య హత్య కేసులో పలువురిని రిమాండ్‌కు తరలించినట్లు నర్మెట సీఐ నాగబాబు తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. రామకృష్ణయ్యను హత్య చేయించిన గిరబోయిన అంజయ్యను రెండు రోజుల క్రితం కస్టడీకి తీసుకున్నామని తెలిపారు. అంజయ్యను విచారించగా వారికి భూమి విషయంలో మృతుడు రామకృష్ణయ్య తరచూ ఇబ్బందులకు గురి చేయడంతో సుపారీ ఇచ్చి హత్య చేయించారని వెల్లడైనట్లు చెప్పారు. ఈయనతోపాటు ఈ హత్యకు సహకరించిన మండలంలోని గోపాల్‌నగర్‌కు చెందిన పస్తం జలేందర్‌, పస్తం పెద్ద ఉప్పలయ్య, పోచన్నపేట సర్పంచ్‌ గట్టు మంజుల భర్త గట్టు మల్లేశంలను జనగామ డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డిలు రిమాండ్‌ చేసి కోర్టుకు తరలించినట్లు తెలిపారు. ఈ కేసును నిష్పక్షపాతంగా విచారణ చేశామని ఈ కేసుపై పూర్తి నిర్ణయాలను వరంగల్‌ సీపీ రంగనాథ్‌ తీసుకున్నారని తెలిపారు.

ఎస్సీ, ఎస్టీ కోర్టుకు తరలింపు

రెండు రోజుల క్రితం హంతకుడు గిరబోయిన అంజయ్య, సుపారీ గ్యాంగ్‌ భాస్కర్‌, శ్రీకాంత్‌లను డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్‌రెడ్డిలు కస్టడీకి తీసుకున్నారు. విచారణ అనంతరం శుక్రవారం ప్రభుత్వ ఆస్పత్రిలో వారికి వైద్య పరీక్షలను నిర్వహించి వరంగల్‌ ఎస్సీ, ఎస్టీ కోర్టులో అప్పగించి, తిరిగి జనగామ కోర్టుకు తీసుకొచ్చారు.

కాజీపేటలో రైల్వే డివిజనల్‌ మేనేజర్‌ తనిఖీలు

- ప్రధాని భూమి పూజ చేసే వ్యాగన్‌షెడ్‌ పనులు, హెలిపాడ్‌ కోసం స్థల పరిశీలన


రైల్వే వ్యాగన్‌ షెడ్‌ నమూనాను పరిశీలిస్తున్న డీఆర్‌ఎం గుప్తా, అధికారులు

కాజీపేట రూరల్‌: జూలై 8న ప్రధాని మోదీ జిల్లాకు రానున్న నేపథ్యంలో రైల్వే అధికారులు అప్రమత్తమయ్యారు. ఈక్రమంలో సికింద్రాబాద్‌ రైల్వే డివిజనల్‌ మేనేజర్‌ (డీఆర్‌ఎం) ఎకె.గుప్తాతోపాటు వివిధ విభాగాల రైల్వే అధికారులు కాజీపేట జంక్షన్‌ పరిధిలో శుక్రవారం పరిశీలించారు. రైల్వే అధికారులు తెలిపిన వివరాలు.. ముందుగా డీఆర్‌ఎం గుప్తా అయోధ్యపురంలో నిర్మాణంలో ఉన్న రైల్వే వ్యాగన్‌ రిపేర్‌ వర్క్‌షాప్‌ (పీఓహెచ్‌) స్థలం వద్దకు చేరుకొని షెడ్‌ ప్రహరీ పనులు, ప్రధాని మోదీ శంకుస్థాపన భూమి పూజ చేసే ప్రదేశాన్ని పరిశీలించారు. వ్యాగన్‌ షెడ్‌ నమూనా, మ్యాప్‌ను పరిశీలించి స్థానిక అధికారులకు పలు సూచనలు చేశారు. అక్కడి నుంచి హనుమకొండ జిల్లా కలెక్టర్‌ కార్యాలయానికి చేరుకుని కలెక్టర్‌ సిక్తా పట్నాయక్‌తో సమావేశమై ప్రధాని పర్యటన వివరాలు, ఏర్పాట్లపై తెలుసుకున్నట్లు సమాచారం. హనుమకొండలోని ఆర్ట్స్‌ కాలేజ్‌ గ్రౌండ్‌, ఫాతిమానగర్‌లోని సెయింట్‌ గాబ్రియల్‌ స్కూల్‌ గ్రౌండ్‌లో హెలిపాడ్‌ను డీఆర్‌ఎం పరిశీలించినట్లు తెలిపారు. కాగా, కాజీపేట అయోధ్యపురంలో రూ.386 కోట్ల వ్యయంతో నిర్మించే ఓవర్‌ హాలింగ్‌ వ్యాగన్‌ వర్క్‌షాప్‌నకు భూమి పూజతోపాటు రూ.100 కోట్లతో వ్యాగన్‌ తయారీ పరిశ్రమ యూనిట్‌కు శంకుస్థాపన చేయనున్నట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

బడికెళ్తే బతికెటోడు..

- బావిలో ఈతకు వెళ్లి విద్యార్థి మృతి


బిట్టు(ఫైల్‌)

చిట్యాల: బడికి వెళ్లకుండా ఇంటివద్ద ఉండి స్నేహితులతో కలిసి బావిలో ఈతకు వెళ్లిన ఓ విద్యార్థి ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. జయశంకర్‌ భూపాలపల్లి జిల్లా చిట్యాల మండలంలోని తిర్మలాపూర్‌ గ్రామానికి చెందిన చేరాల రాజబాబు-అనిత (రమ్య) దంపతులకు ఇద్దరు కుమారులు. పెద్ద కుమారుడు బిట్టు(14) మోడల్‌ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. కాగా, శుక్రవారం పాఠశాలకు వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్నాడు. ఈ క్రమంలో మధ్యాహ్నం మూడు గంటల సమయంలో తన స్నేహితులతో కలిసి వెంకట్రావుపల్లి(సి) గ్రామ శివారులోని బావిలో ఈతకు వెళ్లారు. ప్రమాదవశాత్తు బావిలోనే గల్లంతయ్యాడు. దీంతో అతని స్నేహితులు గ్రామస్తులకు సమాచారం అందించగా.. విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు బావి వద్దకు చేరుకుని బోరున విలపించారు. సమాచారం అందుకున్న సీఐ వేణుచందర్‌, మొగుళ్లపల్లి, టేకుమట్ల ఎస్సైలు శ్రీధర్‌, చల్లా రాజు, చిట్యాల ఏఎస్సై మధుసూదన్‌, పోలీస్‌ సిబ్బంది లింగన్న సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించారు. బావిలో నీరు ఎక్కువ ఉండడంతో గ్రామస్తుల సాయంతో నాలుగు మోటార్లతో అర్ధరాత్రి వరకు నీటిని బయటకు పంపించారు. దీంతో విద్యార్థి మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

భార్యను కత్తితో పొడిచిన భర్త

- మద్యానికి డబ్బులు ఇవ్వకపోవడమే కారణం

ఎస్‌ఎస్‌ తాడ్వాయి : మద్యానికి డబ్బులు ఇవ్వలేదని భర్త భార్యను కత్తితో పొడిచిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మహారాష్ట్ర ప్రాంతానికి చెందిన అనిల్‌ అనే వ్యక్తి కుటుంబ సభ్యులతో బతుకుదెరువు కోసం మేడారంలో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో గర్భవతిగా ఉన్న భార్య శ్యామలను జూన్‌ 28న మద్యం తాగడానికి డబ్బులు అడగ్గా.. ఆమె నిరాకరించడంతో ఆవేశంలో భార్యను కత్తితో పొడిచాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మేడారానికి వెళ్లి గాయపడిన శ్యామలను అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించారు. అనిల్‌ పరారీలో ఉన్నట్లు ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. వారికి ఆరుగురు సంతానం ఉండగా, డీసీపీఓ బృందానికి సమాచారం అందించగా వారు పిల్లల సంరక్షణ చర్యలు తీసుకున్నారు. గాయపడిన శ్యామల కోలుకున్న తర్వాత ఈ విషయంపై ఫిర్యాదు స్వీకరించి కేసు నమోదు చేస్తానని ఎస్సై తెలిపారు.

అలిగేటి చెక్‌డ్యాంలో విద్యార్థి గల్లంతు

బయ్యారం: మండల కేంద్రం సమీపంలోని అలిగేటి చెక్‌డ్యాం వద్ద ఈతకు వెళ్లి పదో తరగతి విద్యార్థి గల్లంతైన ఘటన శుక్రవారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన షేక్‌ ఉస్సేన్‌-లాల్‌బీ కుమారుడు ఉమర్‌ యాసిన్‌ మహబూబాబాద్‌లోని ఓ పాఠశాలలో పదో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు సెలవు కావడంతో యాసిన్‌ ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం చీకటి పడే వరకు ఇంటికి రాకపోవడంతో తల్లిదండ్రులు కుమారుడి ఆచూకీ కోసం వెతకగా అలిగేటి సమీపంలో దుస్తులు, సైకిల్‌ లభించాయి. అలిగేటిలో ఈతకు వెళ్లి గల్లంతు కావచ్చని కుటుంబ సభ్యులు, స్థానికులు రాత్రి వరకు గాలించినప్పటికీ ఆచూకీ లభ్యం కాలేదు.

నకిలీ మావోయిస్టుల అరెస్ట్‌

- మావోయిస్టు లెటర్‌ప్యాడ్‌తో డబ్బులు డిమాండ్‌
- చాకచక్యంగా పట్టుకున్న పోలీసులు


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి

కాటారం: మావోయిస్టుల పేరిట లెటర్‌ప్యాడ్‌ సృష్టించి పలిమెల మండలం పంకెన సర్పంచ్‌ బొచ్చు శ్రీనివాస్‌, రామగుండం మేయర్‌ బంగి అనిల్‌కుమార్‌కు లెటర్‌ పోస్టు చేసి డబ్బులు డిమాండ్‌ చేసిన నలుగురు నకిలీ మావోయిస్టులను పోలీసులు అరెస్ట్‌ చేశారు. కాటారం డీఎస్పీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో డీఎస్పీ గద్దం రామ్మోహన్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. పలిమెల మండలం పంకెన గ్రామానికి చెందిన ఎర్ని సోమయ్య హైదరాబాద్‌లో పని చేస్తున్నప్పుడు పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం ఎలుకలపల్లికి చెందిన చిలుముల తిరుపతి పరిచమయ్యాడు. ఆర్థిక ఇబ్బందుల కారణంగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో ఇద్దరు కలిసి మావోయిస్టుల పేరిట డబ్బున్న వ్యక్తులను బెదిరించి సొమ్ము చేసుకోవాలని భావించారు. ఈ క్రమంలో మావో యిస్టు లెటర్‌ ప్యాడ్‌ల ద్వారా డబ్బులు డిమాండ్‌ చేయాలని వాటి నమూనాను యూ ట్యూబ్‌లో పరిశీలించారు. కరపత్రాలను తయారు చేయడానికి మరో ఇద్దరు అవసరం పడగా తిరుపతి బామ్మర్ది గోదావరిఖనికి చెందిన ఈర్ల రాంచందర్‌, జిరాక్స్‌ సెంటర్‌ నిర్వాహకుడు టేకుల సుధీర్‌కు వీరి ప్లాన్‌ వివరించారు. మావోయిస్టు రెడ్‌ లెటర్స్‌తో లెటర్‌ప్యాడ్‌ తయారు చేసి జూన్‌ 15న హైదరాబాద్‌లోని ఓ పోస్ట్‌ ఆఫీస్‌ నుంచి పంకెన సర్పంచ్‌ బొచ్చు శ్రీనివాస్‌, రామగుండం మేయర్‌ బంగి అనిల్‌కుమార్‌కు నిందితులు పోస్ట్‌ చేశారు. రెండు రోజుల తర్వాత నిందితులు ఓ ఫోన్‌ ద్వారా సర్పంచ్‌కి ఫోన్‌ చేసి రూ.ఐదు లక్షలు కరీంనగర్‌ బస్టాండ్‌ నందు ముట్టజెప్పాలని బెదిరించారు. దీంతో భయభ్రాంతులకు గురైన సర్పంచ్‌ జూన్‌ 29న పలిమెల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అదే రోజు గ్రామంలో ఏం జరుగుతుందో తెలుసుకుందామని ఎర్ని సోమయ్య గ్రామానికి రాగా సమాచారం అందుకున్న పలిమెల పోలీసులు గ్రామానికి చేరుకొని సోమయ్యని అదుపులోకి తీసుకొని విచారించారు. సోమయ్య తెలిపిన సమాచారంతో మిగితా నిందితులైన తిరుపతిని హైదరాబాద్‌లో రాంచందర్‌, సుధీర్‌ను గోదావరిఖనిలో పలిమెల పోలీసులు అదుపులోకి తీసుకొన్నట్లు డీఎస్పీ వివరించారు. నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి నాలుగు ఆండ్రాయిడ్‌ మొబైల్‌ఫోన్లు, మూడు మావోయిస్టు లెటర్‌ప్యాడ్లు, కలర్‌ ప్రింటర్‌ స్వాధీనపర్చుకున్నట్లు డీఎస్పీ వెల్లడించారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యంగా వ్యవహరించిన కాళేశ్వరం, పలిమెల ఎస్సైలు లక్ష్మణ్‌రావు, అరుణ్‌, శివ, కానిస్టేబుళ్లు బాల్‌సింగ్‌, శ్యాం, మధు, సమ్మయ్య, అరుణ్‌, సంతోష్‌లను ఎస్పీ సురేందర్‌రెడ్డి, అడిషనల్‌ ఎస్పీ శ్రీనివాసులు, కాటారం డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి అభినందించారు.

బయటకెళ్లిన ఐదు నిమిషాలకే..

- జాకారంలో వ్యక్తిని ఢీకొట్టిన కారు, లారీ
- అక్కడికక్కడే వ్యక్తి మృతి


రఘుపతి (ఫైల్‌)

ములుగు: గ్రామం నుంచి పొలం పనులకు వెళ్లిన ఐదు నిమిషాల సమయంలోనే వాహన రూపంలో వచ్చిన మృత్యువు ఓ వ్యక్తిని కబలించింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జాకారం గ్రామానికి చెందిన రుద్రబోయిన రఘుపతి(45) పని నిమిత్తం తన ద్విచక్రవాహనంపై పత్తిమిల్లుల వైపునకు వెళ్లాడు. అదేసమయంలో ములుగు నుంచి వస్తున్న కారు టైరు పంక్చర్‌ కావడంతో రఘుపతిని ఎదురుగా ఢీ కొట్టింది. దీంతో తన ద్విచక్రవాహనంపై నుంచి రోడ్డు అంచున పడ్డాడు. అదే సమయంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన ఇసుక లారీ రఘుపతిని మళ్లీ ఢీ కొట్టడంతో నడుము నుంచి కాళ్ల వరకు దేహం నుజ్జునుజ్జయి అక్కడికక్కడే ప్రాణాలు విడిచాడు. ఇంటినుంచి బయటకెళ్లిన ఐదు నిమిషాలకే రఘుపతి మృత్యువాత పడడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. విషయం తెలుసుకున్న ఎస్సై లక్ష్మారెడ్డి పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని పరిశీలించారు. రఘుపతి భార్య అనిత విలపించిన తీరు స్థానికులను కంటతడి పెట్టించింది. కారు డ్రైవర్‌ పరారీలో ఉండగా లారీ డ్రైవర్‌ తప్పించుకునే ప్రయత్నం చేయగా.. లారీ ఓనర్స్‌ సాయంతో మల్లంపల్లిలో పట్టుకున్నారు. కాగా, రఘుపతికి భార్య, కుమార్తెలు లక్ష్మీప్రసన్న, శ్రీవిద్య ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మడికొండ: రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం చెందిన సంఘటన కాజీపేట మండలం భట్టుపల్లి శివారులో గురువారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం వరంగల్‌ ప్రాంతానికి చెందిన సూత్రపు హరీశ్‌ (26) కాజీపేటలోని తన స్నేహితుడి ఇంటికి వచ్చి తిరిగి వరంగల్‌కు వెళ్తుండగా భట్టుపల్లి శివారు పెట్రోల్‌పంపు వద్ద అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు మడికొండ పోలీసులు వెల్లడించారు.

చేపల వేటకువెళ్లి.. బావిలో శవమై..


పెద్దలింగయ్య (ఫైల్‌)

కేసముద్రం: చేపలు పట్టేందుకు ఇంట్లో నుంచి వెళ్లిన ఓ వ్యక్తి, మూడు రోజుల తర్వాత వ్యవసాయబావిలో శవమై కనిపించిన ఘటన మానుకోట జిల్లా కేసముద్రం మండలంలోని పెనుగొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై తిరుపతి శుక్రవారం తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నిమ్మల పెద్ద లింగయ్య(68) జూన్‌ 27న చేపలు పట్టేందుకు చేపల వలతో ఇంట్లో నుంచి బయటకు వెళ్లాడు. సాయంత్రం ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు చుట్టు పక్కల వెతికినా ఆచూకి లభించలేదు. ఈక్రమంలో నర్సింహులగూడెంకు చెందిన ఓ వ్యక్తి శుక్రవారం చెరువువైపునకు వెళ్లగా, పక్కనే ఉన్న వ్యవసాయ బావిలో మృతదేహం తేలిఉండటాన్ని గుర్తించాడు. బాధిత కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని బయటకు తీయించి, పోస్టుమార్టం నిమిత్తం మానుకోట జిల్లా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదవశాత్తు బావిలో జారిపడటంతో వల చిక్కుకుని, నీటమునిగి మృతిచెందినట్లు గుర్తించారు. కాగా, మృతుడి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. పెద్దలింగయ్యకు భార్య మల్లికాంబ, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

భర్త ఇంటి ఎదుట ఆందోళన

డోర్నకల్‌: ప్రేమించి పెళ్లి చేసుకుని వదిలేసిన భర్త ఇంటి ఎదుట భార్య ఆందోళన చేపట్టింది. మానుకోట జిల్లా గార్ల మండలానికి చెందిన యువతికి సీరోలు మండలం మోదుగగడ్డతండాకు చెందిన రాజ్‌కుమార్‌తో ఫోన్లో ఏర్పడిన పరిచయం ప్రేమగా మారి కొంతకాలం క్రితం పెద్దల సమక్షంలో వివాహం చేసుకున్నారు. కొంతకాలం తర్వాత ఇద్దరి మధ్య మనస్పర్థలు వచ్చి గొడవలు జరిగాయి. ఈ నేపథ్యంలో భర్త తనను కలవకుండా ముఖం చాటేయడంతో సదరు యువతి శుక్రవారం మోదుగగడ్డతండాలోని భర్త ఇంటి ఎదుట ఆందోళన చేపట్టింది. దీనిపై డోర్నకల్‌ సీఐ ఉపేందర్‌రావును వివరణ కోరగా భార్యాభర్తల గొడవ తమ దృష్టికి వచ్చిందని, కౌన్సిలింగ్‌ నిర్వహిస్తామని తెలిపారు.

క్లుప్తంగా

పొంగులేటిని కలిసిన కాంగ్రెస్ నాయకులు



మహబూబాబాద్ రూరల్: ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని జిల్లా కాంగ్రెస్ నేతలు శుక్రవారం ఆయన నివాసంలో కలిశారు. డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డి, నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ భూక్య మురళీనాయక్ మరికొంత మంది పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని శాలువాతో సత్కరించి బొకే అందజేశారు.

దంతాలపల్లి: మండలం దాట్ల గ్రామం ఎంపీటీసీ, రాష్ట్ర ఎంపీటీసీల ఫోరం కార్యదర్శి కొమ్మినేని సతీష్ శుక్రవారం పొంగులేటి శ్రీనువాస్ రెడ్డిని ఖమ్మంలో గల తన నివాస గృహంలో మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు.

మంత్రికి వినతిపత్రం అందజేత



గార్ల: మహబూబాబాద్ పర్యటనకు వచ్చిన మంత్రి కేటీఆర్‌ను శుక్రవారం గార్ల ఎంపీపీ ఎం శివాజీచౌహాన్ ఎమ్మెల్యే బానోత్ హరిప్రియతో కలిసి ఇటీవల గార్లలో తనపై దాడికి పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించేలా చర్యలు తీసుకోవాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు స్పందించిన మంత్రి కేటీఆర్ ఎంపీపీపై దాడికి పాల్పడిన నిందితులపై వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్‌ను ఆదేశించినట్లు ఎంపీపీ గార్లలో విలేకరులకు తెలిపారు.

టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు..



మహబూబాబాద్: జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ అండ్ నాన్ వెజ్ మార్కెట్‌ను మంత్రి కేటీఆర్ ప్రారంభించిన తర్వాత కూరగాయలు విక్రయించే వ్యాపారులతో మంత్రి మాట్లాడుతున్న క్రమంలో టీఎన్జీఓఎస్ జిల్లా అధ్యక్షుడు వడ్డెబోయిన శ్రీనివాస్ మంత్రి బొకే ఇవ్వడంతో పాటు వినతిపత్రం అందజేశారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని వినతిలో పేర్కొన్నట్లు శ్రీనివాస్ తెలిపారు.

ప్రత్యేక పూజలు



మరిపెడ రూరల్: మండలంలోని దంట్లకుంట తండా గ్రామ పంచాతీయ పరిధిలోని గిరిజనుల ఆరాధ్యదైవం పన్ని భవాని (పన్నిదాది) అమ్మవారి ఆలయంలో గిరిజ ప్రజలు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి జలాభిశేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోతు భరత్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ వైద్యుల దినోత్సవం



గార్ల: అంతర్జాతీయ డాక్టర్ల దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో డాక్టర్లు కేక్ కట్ చేసి ప్రజాప్రతినిధులకు మిఠాయిలు పంచారు. కార్యక్రమంలో ఎంపీపీ శివాజీచౌహాన్, డాక్టర్ అవినాష్, సర్పంచ్ అజ్మీర బన్సీలాల్, ఎంపీటీసీలు శీలంశెట్టి రమేష్, వెంకట్‌లాల్, రాజకుమారి, మంజుల, నాగమణి, సుగుణాదేవి, కోఆప్షన్ ఎండి ఖదీర్, సర్పంచ్‌లు కుంతి, జ్యోతి, అధికారులు పాల్గొన్నారు.

మృతికి సంతాపం

గూడూరు: మండలంలోని సీతానగరం శివారు రెడ్డిపల్లెలో విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల ప్రకారం రెడ్డిపల్లెకు చెందిన సూత్రపు హరీశ్ (25) అనే యువకుడైన ఫొటో గ్రాఫర్ శుక్రవారం ఉదయం ఉమ్మడి వరంగల్ జిల్లా ఖాజీపేట, హనుమకొండ మధ్యన ద్విచక్రవాహనంపై వస్తూ, డివైడర్‌కు ఢీకొని మృతిచెందాడు. సూత్రపు రవి, పద్మలకు ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉంది. మండల ఫొటో గ్రాఫర్‌లతో పాటు జిల్లా ఫొటో గ్రాఫర్స్ అండ్ వీడియో గ్రాఫర్స్ యూనియన్ ప్రతినిధులు హరీశ్ మృతిపట్ల రెడ్డి పల్లెకు చేరుకొని సంతాపం తెలిపారు. అతని దహన సంస్కారాల కోసం మండల ఫొటో గ్రాఫర్ల సంఘం తరఫున రూ.20వేలు అందించారు.

అక్రమ అరెస్టులు అన్యాయం

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా శుక్రవారం, గురువారం అర్ధరాత్రి నాయకులను ముందస్తు అరెస్ట్ చేశారు. ఈసందర్భంగా సీపీఐ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ బి.అజయ్ సారథిరెడ్డి, సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజాస్వామ్యమా, పోలీసుల రాజ్యమా అని ప్రశ్నించారు. పోలీసులు అరెస్టు చేసిన వారిలో బి.అజయ్ సారథిరెడ్డి, సాదుల శ్రీనివాస్, మండల వెంకన్న, గుగ్గిళ్ల పీరయ్య, రియాజ్ అన్సారీ, వద్ది రాజు రాంచందర్ రావు, తదితరులు ఉన్నారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు.

కొత్తగూడ: మండలంలో బీజేపీ నాయకులు మునేందర్, నవీన్‌నాయక్, రవి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వజ్జ సారయ్య, తుడుందెబ్బ రాష్ట్ర సాంస్కృతిక కార్యదర్శి ఆగబోయిన రవి, ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర నాయకుడు మల్లెల కృష్ణలను అరెస్ట్ చేసి , వ్యక్తిగత పూచికత్తుపై విడుదల చేశారు.

కేసముద్రం: మండలంలో వివిధ పార్టీలు, సంఘాలకు చెందిన వల్లభు వెంకటేశ్వర్లు, ఎస్.అశోక్‌స్టాలిన్, ముజీబ్‌అక్తర్, గుగులోతు శ్రీనివాస్, గుగులోతు శంకర్, ఎల్లబోయిన కరుణాకర్, కొలిపాక వెంకన్న అరెస్టయిన వారిలో టున్నారు.

బయ్యారం: జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా పలువురు ప్రతిపక్షపార్టీల, కుల సంఘాల నాయకులను పోలీసులు ముందుజాగ్రత్తగా బయ్యారం పోలీస్‌స్టేషన్‌లో నిర్బంధించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, సీపీఐ, సీపీఎం పార్టీల మున్సిపల్ ఫ్లోర్‌లీడర్లు అజయ్‌సారథి, సూర్నపు సోమయ్య, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు మండల వెంకన్న, వైఎస్ఆర్‌టీపీ జిల్లా నాయకులు గుగులోత్ రాములునాయక్, గుగ్గిళ్ల పీరయ్యమాదిగ, తదితరులను స్టేషన్‌లో ఉంచి సాయంత్రం విడుదల చేశారు.



మహబూబాబాద్: టౌన్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో అరెస్టయిన నాయకులు

డోర్నకల్: కాంగ్రెస్ నాయకులు దరంసోత్ జగదీష్, కాసం శేఖర్, ప్రవీణ్, సురేష్, బీజేపీ నాయకులు బాసాని నాగేశ్వర్‌రావు, గణేష్‌నాయక్, దేవా, లాల్‌సింగ్ తదితరులను సీఐ బి.ఉపేందర్‌రావు ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకుని మధ్యాహ్నం విడిచి పెట్టారు.

కురవి: ప్రతిపక్ష పార్టీలు, విద్యార్థి సంఘాల నాయకులను అరెస్టు చేయడం అన్యాయమని బీజేపీ, పీడీఎస్‌యు, ఎస్ఎఫ్ఐ నాయకులు శ్రీరామోజునాగరాజు, బానోత్ దేవేందర్, గంధసిరి జ్యోతిబసు అన్నారు. అరెస్టు అయిన వారిలో కొణతం పెంటయ్య, మురళీ, వీరేందర్ ఉన్నారు.

గార్ల: గార్లలో అరెస్టయిన వారిలో గుండా వెంకట్ రెడ్డి, సర్పంచ్ కుసిని బాబూరావు, గౌని మల్లేష్, జి.సక్రు, మాగం లోకేష్, కె.జగదీష్ ఉన్నారు.



డోర్నకల్: పోలీసుల అదుపులో కాంగ్రెస్, బీజేపీ నాయకులు

గంగారం: మండలంలో అరెస్టు అయిన వారిలో బీజేపీ మండల అధ్యక్షుడు వెంకన్న, ప్రధాన కార్యదర్శి శివరాం, గిరిజన మోర్చా జిల్లా కార్యదర్శి ఈక నరేష్, బీజేవైఎం మండల అధ్యక్షుడు కొండూరి సంతోష్, మండల కోశాధికారి బొల్లి సుధాకర్, జిల్లా కార్యవర్గ సభ్యుడు విజయ్, మాజీ అధ్యక్షుడు పూజారి రవి ఉన్నారు.

చిన్నగూడూరు: మండలంలో అరెస్ట్ అయిన వారిలో కాంగ్రెస్ నాయకులు ఆదాం, బీజేపీ నాయకులు వేణు, లక్ష్మణ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మధు తదితరులు ఉన్నారు.

నెల్లికుదురు: మంత్రి కేటీఆర్ మహబూబాబాద్ పర్యటన సందర్భంగా ముందస్తుగా గురువారం రాత్రి వివిధ పార్టీల నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం ప్రజాస్వామ్య విరుద్ధమని బీజేపి, కాంగ్రెస్ నాయకులు పోలీసులపై మండిపడ్డారు.

పెద్దవంగర: అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని, ప్రజాసమస్యలపై పోరాటం చేస్తామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రంగు రాములు గౌడ్ అన్నారు. అరెస్టు అయిన వారిలో బీజేపీ నాయకులు సుధాకర్, సోమయ్య, రవి, కాంగ్రెస్ నాయకులు శ్యాం, సీతారాం నాయక్, బీఎస్పీ నాయకులు ప్రవీణ్, తదితరులు ఉన్నారు.



బయ్యారం: పోలీసుల అదుపులో పలు పార్టీల, కులసంఘాల నాయకులు



పెద్దవంగరలో



నెల్లికుదురు పోలీస్‌స్టేషన్‌లో బీజేపీ నాయకులు

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీకి తాత్కాలిక పద్ధతిలో అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కోఆర్డినేటర్ రాజ్యలక్ష్మి శుక్రవారం తెలిపారు. జేఎల్ తెలుగు1, జేఎల్ ఇంగ్లిష్ 1, జువాలజీ 5, బాటనీ 1, ఫిజిక్స్ 3, కెమిస్ట్రీ 2, గణితం 1, పీజీటీ బయోసైన్స్ 1, ఫిజికల్‌సైన్స్ 1, టీజీటీ తెలుగు 1, ఇంగ్లిష్ 1, మ్యాథ్స్ 1, బయోసైన్స్ 1, సోషల్ 1, పీడీ 1పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. నేటి నుంచి జూలై 5వ తేదీ సాయంత్రం 4 గంటల లోపు జిల్లా ప్రాంతీయ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మొదట గిరిజన అభ్యర్థులకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. జేఎల్‌కు సబ్జెక్ట్‌లో 50 శాతం మార్కులు ఉండాలని, ఏదైన డిగ్రీ, బీఈడీ తప్పనిసరిగా ఉండాలన్నారు. పీజీటీకి సబ్జెక్టులో 50 శాతం మార్కులు ఉండాలని, బీఈడీ, టెట్ ఉండాలని, టీజీటీలో ఆయా సబ్జెక్టుల లో 50 శాతం మార్కులు ఉండి, బీఈడీ, టెట్ తప్పనిసరిగా ఉన్నవారికి ప్రాధాన్యత కల్పిస్తామన్నారు. వివరాలకు జిల్లా కేంద్రంలోని ఇల్లెందు బైపాస్ రోడ్డులోని కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

వైద్యులను నియమించాలి

కేసముద్రం: కల్వల ఆరోగ్య ఉపకేంద్రంలో వైద్య సిబ్బందిని వెంటనే నియమించాలని నేషనల్ హ్యూమన్ రైట్స్ చైల్డ్ అండ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ ఆర్గనైజేషన్ జిల్లా సెక్రటరీ సోమారపు శ్రీరాములు డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని కల్వల ఆరోగ్య ఉపకేంద్రాన్ని సంఘం సభ్యులు సందర్శించారు. సబ్‌సెంటర్‌లో ఏఎన్ఎం ఒక్కరే ఉండడంతో ఇబ్బందికర పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీ మెంబర్ దండు కరుణాకర్ ఉన్నారు.

ఆహ్వానించి అరెస్టు చేస్తారా..



పైలాన్ ఎదుట నిరసన తెలుపుతున్న నాయకులు



మహబూబాబాద్ అర్బన్: నిరసన తెలుపుతున్న నాయకులు

నెహ్రూసెంటర్/మహబూబాబాద్: మహబూబాబాద్ మున్సిపాలిటీ ఆధ్వర్యంలో మంత్రి కేటీఆర్ అభివృద్ధి పనులు, శంకుస్థాపనలకు ఆహ్వానించి కౌన్సిలర్లను, ఫ్లోర్‌లీడర్‌ను అరెస్టు చేసి హక్కును కాలరాసారని సీపీఐ మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ బి.అజయ్‌సారథిరెడ్డి అన్నారు. మంత్రి పర్యటన సందర్భంగా అరెస్టులు చేసి విడుదల చేసిన అనంతరం మంత్రి కేటీఆర్ ఆవిష్కరించిన శిలాఫలకం (పైలాన్) ఎదుట కార్యక్రమ ఆహ్వానాన్ని, నిధుల జీఓ కాపీలను ఉంచి సీపీఐ ఆధ్వర్యంలో నిరసన శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా అజయ్‌సారథిరెడ్డి మాట్లాడుతూ.. కేటీఆర్ 5 ఏండ్ల క్రితం సంతకం చేసి ఆదేశాలు ఇచ్చిన రూ. 2 కోట్ల నిధులను విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పెరుగు కుమార్, సహాయ కార్యదర్శి రేషపల్లి నవీన్, జిల్లా కార్యవర్గ సభ్యులు చింతకుంట్ల వెంకన్న, నాయకులు వీరవెల్లి రవి, నర్ర శ్రావణ్, నక్క నాగార్జున, విష్ణువర్ధన్, శ్రావణ్, మహమూద్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్ట్ అప్రజాస్వామికం

మహబూబాబాద్ రూరల్: బీఆర్ఎస్ ప్రభుత్వం భావ ప్రకటన స్వేచ్ఛ హక్కుకు భంగం కల్పిస్తుందని సీపీఐ మండల కార్యదర్శి తండ సందీప్ అన్నారు. జిల్లా కేంద్రానికి మంత్రి కేటీఆర్ వచ్చిన క్రమంలో ముందస్తు అరెస్టులో భాగంగా సందీప్‌ను రూరల్ పోలీసులు శుక్రవారం అరెస్టు చేశారు.

అక్రమ అరెస్టులను ఖండించాలి

మహబూబాబాద్ అర్బన్: ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులను అక్రమ అరెస్టులను ఖండించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బానోత్ సింహాద్రి డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు చందు, సురేష్, సీతారాం, చరణ్, నగేష్ పాల్గొన్నారు.

గార్ల: పోలీసుల అక్రమ అరెస్ట్‌లను నిరసిస్తూ సీపీఐ, న్యూడెమోక్రసీ పార్టీల ఆధ్వర్యంలో వేర్వేరుగా గార్లలో రాస్తారోకోలు నిర్వహించారు. నాయకులు కట్టబోయిన శ్రీనివాసరావు, వెంకన్న, రమేష్, సర్పంచ్ కుసిని బాబూరావు, గౌని భద్రయ్య పాల్గొన్నారు.

మోదీ పాలనను ప్రజల్లోకి తీసుకెళ్తాం

మహబూబాబాద్ రూరల్: బీజేపీ ఇంటింటి ప్రచారంలో భాగంగా మహబూబాబాద్ మండలంలోని వేమునూరు గ్రామంలో 167 నంబరు బూత్ పరిధిలో శుక్రవారం కేంద్ర ప్రభుత్వ అభివృద్ధి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నవీన్ కుమార్, తమిళనాడుకు చెందిన ప్రచారక్ లింగంపన్ శ్రీరామ్, మండల ప్రధాన కార్యదర్శులు రాజు, శీను, హుస్సేన్ పాల్గొన్నారు.

తొర్రూరు రూరల్: కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తున్నట్లు తమిళనాడు రాష్ట్రానికి చెందిన రాష్ట్ర బీజేపీ నాయకుడు మోహన్ దాస్‌జీ అన్నారు. శుక్రవారం మండలంలోని వెలికట్ట గ్రామంలో బీజేపీ పార్టీ ఆధ్వర్యంలో ఇంటింటా కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం చేశారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీ పార్టీకి అండగా నిలిచి, తెలంగాణలో డబుల్ ఇంజన్ పాలనను తీసుకరావాలన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేష్, రవితేజ, వెంకన్న, కుమారస్వామి పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: ప్రచారం చేస్తున్న నాయకులు

అంతిమయాత్రలో కళాకారులు

నెల్లికుదురు: హైదారాబాద్‌లో గురువారం సాయంత్రం నిర్వహించిన తెలంగాణ ఉద్యమకారుడు, సాంస్కృతిక సారథి పాటల శిఖరం గిడ్డంగుల సంస్థ చైర్మన్ సాయి చందు అంతిమయాత్రలో నెల్లికుదురు మండల కళాకారులు దర్శనం యుగేందర్ తోపాటు వివిధ గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

పెద్దవంగర: మానుకోట జిల్లా పెద్దవంగర మండలంలోని ఉప్పరగూడె గ్రామంలో అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్సై పిల్లల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పరగూడెం గ్రామానికి చెందిన ఏనుగంటి (35) సమ్మయ్య కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. రెండేళ్ల క్రితం తమ్ముడు సంపత్ అనారోగ్యంతో బాధపడుతుండగా వైద్య కోసం రూ.3లక్షల అప్పు చేసి చికిత్స చేయించాడు. అయినప్పటికీ రోగం నయం కాక మృతి చెందాడు. దీంతో తెచ్చిన అప్పు రెట్టింపు అయింది. అప్పు తీర్చలేక గురువారం రాత్రి గడ్డిమందు తాగాడు. గమనించిన స్థానికులు తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందాడు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అస్వస్థతతో మత్స్యకారుడి మృతి

తొర్రూరు రూరల్: చేపల వేటకు వెళ్లి అస్వస్థతకు గురైన ఓ మత్స్య కార్మికుడు మృతి చెందిన సంఘటన మండలంలోని పోలెపెల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం పులుగుజ్జు సురేష్(35) అనే మత్స్య కార్మికుడు రోజువారీగా ఉదయమే మత్స్యకారులతో కలిసి చెరువులోకి చేపల వేటకు వెళ్లి కొద్దీసేపటికే చెరువులో నుంచి బయటకు వచ్చి అస్వస్థతకు గురయ్యాడు. దీంతో పక్కనే ఉన్న తోటి మత్స్యకారులు వెంటనే పులుగుజ్జు సురేష్‌ను తొర్రూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి భార్య హేమలతతోపాటు ఇద్దరు కుమారైలు, కుమారుడు ఉండగా, చిన్న వయస్సులోనే మృతి చెందడంతో భార్య, పిల్లలు, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా రోధించారు.

మార్కెట్‌లో జారిపడి రైతుకు గాయాలు

కేసముద్రం: నెల్లికుదురు మండలం నైనాలకు చెందిన యాసం వెంకన్న అనే రైతు, మార్కెట్‌లో ధాన్యం అమ్ముకునేందుకు వచ్చాడు. అయితే అప్పటికే ట్రాక్టర్ ఇంజన్ నుంచి కారిన అయిల్ షెడ్డులో పడింది. అది గమనించని రైతు నడుచుకుంటూ అయిల్‌పై కాలువేయడంతో జారి ఒక్కసారిగా కిందపడ్డాడు. కాలుకు, నడుము భాగంలో గాయ్యాయి. మార్కెట్‌కు వచ్చే రైతులకు వైద్య సేవలు అందించేందుకు మార్కెట్‌లో ఏర్పాటుచేసిన పీహెచ్‌సీకి వైద్యులు రాకపోవడంతో ఆస్పత్రికి తాళం వేసి ఉండటంతో, చేసేదీ ఏమిలేక, దీంతో 108లో మానుకోట ఆస్పత్రికి అతడిన తరలించారు. బాధిత రైతుకు ఆర్థికసాయం అందించనున్నట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

బీఆర్ఎస్‌లో చేరిక

కేసముద్రం: ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన జిల్లా వికలాంగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు దేవులపల్లి సునీల్‌కుమార్ శుక్రవారం మహబూబాబాద్‌లో ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరినట్లు బీఆర్ఎస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు దార్ల భాస్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

సద్వినియోగం చేసుకోవాలి

కురవి: ఆధార్ నమోదుతోపాటు పలురకాల సేవలను సద్వినియోగం చేసుకోవాలని మహబూబాబాద్ తపాలా శాఖ సహాయక పర్యవేక్షకుడు ఎల్.సైదానాయక్ అన్నారు. శుక్రవారం మండంలోని మోద్దులగూడెం బ్రాంచి పోస్టాఫీసులో ఆధార్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో వాసం అనిల్‌కుమార్, పరమేశ్వర్, డీఎస్ కిషన్ పాల్గొన్నారు.

సభను జయప్రదం చేయాలి



కురవి: ఖమ్మం జిల్లా కేంద్రంలో జూలై 2వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జరగబోయే జనగర్జన సభను విజయవంతం చేయాలని కురవి టౌన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ రాజేందర్‌కుమార్ శుక్రవారం పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిన్నం గణేష్, కామిండ్ల వీరన్న, మిర్యాల లక్ష్మ య్య, కామిండ్ల ఆనందం పాల్గొన్నారు.

గార్ల: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ ఖమ్మంలో జూలై 2వ తేదీన నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు దనియాకుల రామారావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని బహిరంగ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి కృష్ణగౌడ్, శంషాద్‌బేగం, భిక్షపతి, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశం

గార్ల: పాకాల ఏటిపై నేటికీ హైలెవెల్ బ్రిడ్జి నిర్మించడం లేదని వైస్ ఎంపీపీ కట్టబోయిన శ్రీనివాసరావు సమావేశాన్ని బాయ్‌కాట్ చేస్తున్నట్లు ప్రకటించి వెళ్లిపోయారు. శుక్రవారం ఎంపీపీ ఎం శివాజీచౌహాన్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో ప్రారంభం కాగానే వైస్ ఎంపీపీ లేచి జిల్లాకు మంత్రి కేటీఆర్ వస్తున్నారని వామపక్ష పార్టీల నాయకులను అరెస్ట్ చేయడం తెలుసు కాని, బ్రిడ్జి నిర్మాణం చేపట్టడం తెలియదా అంటూ ఆగ్రహంతో వెళ్లిపోయారు. ఎంఈఓ తన ప్రగతి నివేదికను చదువుతుండగా ములకనూరు ఎంపీటీసీ మాలోత్ వెంకట్‌లాల్ లేచి పెద్ద కిష్టాపురం హైస్కూల్లో గత మార్చిలో 10వ తరగతిలో జీరో రిజల్ట్ రావడంపై సమావేశంలో ఎంఈఓను నిలదీశారు. సమావేశంలో సర్పంచ్ బన్సీలాల్, ఎంపీటీసీలు రమేష్, వెంకట్‌లాల్, నాగమణి, రాజకుమారి, కోఆప్షన్ సభ్యులు ఖదీర్, సర్పంచ్‌లు కుంతి, రుక్మిణీ, జ్యోతి, భారతి పాల్గొన్నారు.

సెంటర్ల వద్ద 144సెక్షన్ అమలు

నెల్లికుదురు: మండల కేంద్రంలోని ఆదర్శపాఠశాలలో నేడు (శనివారం) జరుగనున్న గ్రూప్–4 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సెంటర్ చీఫ్ సూపరింటెండెంట్ వెంకట్రాజయ్య తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆదర్శపాఠశాలలో నిర్వహించే పరీక్షకు 432 మంది విద్యార్థులను కేటాయించినట్లు తెలిపారు. ఒక్కొక్క గదిలో 24మందితో 18 గదులల్లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాగునీరు, గదులల్లో వెంటలేషన్ సౌకర్యం కల్పించిన్నట్లు తెలిపారు. పరీక్ష సెంటర్ వద్ద 144సెక్షన్ అమలులో ఉంటుందన్నారు.

దంతాలపల్లి: మండలకేంద్రంలో గ్రూప్–4 పరీక్ష కేంద్రమైన దంతాలపల్లి ఉన్నత పాఠశాలను పరీక్ష నిర్వహన అధికారి శ్రీనువాస్ తహసీల్దార్ శివాని, ఎంపీడీఓ విజయలక్ష్మితో కలిసి శుక్రవారం పరిశీలించారు. కార్యాక్రమంలో అసిస్టెంట్ సూపరింటెండెంట్ బ్రహ్మానందరెడ్డి, హర్షవర్ధన్‌రెడ్డి, యాకుబ్‌ఆలీ, ప్రవీణ్‌రెడ్డి పాల్గొన్నారు.

జిరాక్స్ సెంటర్‌లు బంద్ చేయాలి

గూడూరు: నేడు జరిగే గ్రూప్–4 పరీక్ష సందర్భంగా మండల కేంద్రంలోని అన్ని జిరాక్స్ సెంటర్‌లు బంద్ చేయాలని తహసీల్దార్ అశోక్‌కుమార్ శుక్రవారం తెలిపారు. నిబంధన పాటించని వారిపై చర్యలు తీసుకుంటామన్నారు.

రేషన్‌షాపుల్లో 12రకాల సరుకులు ఇవ్వాలి

కేసముద్రం: రేషన్‌షాపుల ద్వారా 12 రకాల సరుకులు ఉచితంగా అందించాలంటూ ఇనుగుర్తి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట పీవైఎల్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈసందర్భంగా పీవైఎల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పైండ్ల యాకయ్య మాట్లాడుతూ.. రాయితీలు కార్పొరేట్‌లకు కాదు, పేదలకు ఇవ్వాలనే నినాదంతో, పీవైఎల్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా దశలవారీగా ఉద్యమం జరుగుతుందన్నారు. ఒక్కొక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి 10కేజీల సన్న బియ్యం అందించాలని, అదేవిధంగా నిత్యావసర వస్తువులను అందించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఇరుగు అనిల్, సహాయ కార్యదర్శి రంగయ్య, ప్రవీణ్, గంగరాజు పాల్గొన్నారు.



వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

వైభవంగా 'సందల్' ఊరేగింపు



ప్రార్థనలు చేస్తున్న ముస్లిం మత పెద్దలు, ఎమ్మెల్యే శంకర్ నాయక్, అధికారులు

మహబూబాబాద్ రూరల్: బక్రీద్ పండుగ తెల్లవారు రోజున ముస్లింలు భక్తిశ్రద్ధల మధ్య తీసుకెళ్లే సందల్ (గంధం), ఖందిల్ ఊరేగింపు కార్యక్రమం శుక్రవారం రాత్రి మానుకోటలో వైభవంగా జరిగింది. సంప్రదాయంగా వస్తున్న ఆనవాయితీ, ఆచారం. ప్రకారం పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్ ఆధ్వర్యంలో సయ్యద్ ఇమాంషావలీ దర్గాలో సమర్పించేందుకు తీసుకెళ్లే సందల్(గంధానికి)కు ముస్లిం మతపెద్దలు అబ్దుల్ హమీద్, మహ్మద్ సయీద్ అహ్మద్ రిజ్వీ ప్రత్యేక పూజలు నిర్వహించి ఫాతేహ షరీఫ్ ఇచ్చారు. ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై సందల్ ప్రార్థనల్లో పాల్గొని అల్లాను స్తుతిస్తూ ప్రార్థనలు చేశారు. అనంతరం ఎమ్మెల్యే బానోత్ శంకర్ నాయక్, తహసీల్దార్ ఇమ్మాన్యుయేల్, డీటీ త్రినాద్, ఆర్ఐ రహమాన్, సిబ్బంది గంధాన్ని తలపై మోసుకుని తీసుకువచ్చి ఇమాంషావలీ దర్గాకు సాగనంపారు. సందర్భంగా ఫకీర్లు అధికారులు తీసుకువెళ్లే గంధం ఎదుట విన్యాసాలు ప్రదర్శించారు. ముందుగా పట్టణంలోని రైల్వేస్టేషన్ ఎదుట గల గౌసియేపాక్‌ఛిల్లా జెండా గద్దెల వద్ద కూడా గంధాన్ని ఉంచి ఫాతియాలిచ్చి ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఖందిల్‌తోపాటు ఈ రెండురకాల గంధాన్ని ఈదులపూసపల్లిలో గల ఇమాంషావలి దర్గాలో శనివారం సమర్పించనున్నారు. ఇదే రోజున ఈ ప్రాంతంలో ఘనంగా ఉర్సు ఉత్సవం జరుగనుంది. కార్యక్రమంలో ముస్లింలు ఎండి.హారుణ్, ఆసిఫ్ అలీ ఫకీర్, యాకుబ్, ఎండీ.ఫరీద్, జిలానీ, వాహెద్, చాంద్, ఎక్బాల్, రెహ్మాన్, గౌస్, దస్తగిరి, ఖలీల్, ఖాజాపాషా, వాజీద్‌పాష, ఆదిల్, వాహెద్, సిద్దిక్, చాంద్, ఉమర్, రహమాన్, జమీల్, సర్వర్, ఫజల్, ఖైసర్, ఈదులపూసపల్లి దర్గా ముతవల్లి అన్వర్, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్ రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, వార్డ్ కౌన్సిలర్ సలీం, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కే మహబూబ్‌పాషా పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన రైతులు



కొత్తగూడ: మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న పోడు పట్టాల పంపిణీ కార్యక్రమంలో పాల్గొనేందుకు మండలం నుంచి ఆదివాసీ గిరిజనులు బయలుదేరి వెళ్లారు. తరలింపును ఆయా గ్రామాల సర్పంచులు పర్యవేక్షించారు.

బయ్యారం: జిల్లా కేంద్రంలో మంత్రి కేటీఆర్ హాజరైన పోడుపట్టాల పంపిణీ సభకు మండలంలోని పలు గ్రామాల నుంచి 45 బస్సుల ద్వారా 2500 మంది రైతులు హాజరైనారు. మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో అధికంగా ఉన్న పోడు రైతులను పట్టాల కోసం ప్రజాప్రతినిధులు, అధికారులు బస్సుల ద్వారా రైతులను తరలించారు.

సాక్షి ఫ్యామిలీ
వరంగల్
శనివారం ॥ 1-7-2023

* మనం మాట్లాడుకోవాల్సిందే!

అధునికత పేరుతో మన మధ్యలోకి డ్రగ్స్ అనే భూతాలు వచ్చాయి. పబ్ కల్చర్ పెరుగుతున్న ఈ రోజుల్లో అబ్బాయిలే కాదు అమ్మాయిలు కూడా డ్రగ్స్‌కు బానిసలవుతున్నారు. ఈ సమస్య బారిన పడకుండా ఉండాలన్నా, డ్రగ్స్‌కు అడిక్ట్ అయినా మనం మాట్లాడుకోవాల్సిందే!


ప్రతీకాత్మక చిత్రం

డ్రగ్స్‌కు దూరంగా ఉందాం..!

'ఈ దశాబ్దం చివరి నాటికి, ప్రపంచవ్యాప్తంగా డ్రగ్స్ వాడేవారి మోతాదులో దాదాపు 11 శాతం పెరుగుదల ఉంటుంద'ని 'యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఆన్ డ్రగ్స్ అండ్ క్రైమ్' తన నివేదికలో పొందుపరిచింది. ఇది ఒక సామాజిక సమస్య. మత్తుకు బానిస కావడానికి కారణాలు వారి సామాజిక, ఆర్థిక పరిస్థితులతో ముడిపడి ఉంటాయి. విద్య, వృత్తి, కుటుంబ ఆదాయం, జెండర్, సామాజిక పోకడలు.. అన్నీ వ్యసనానికి లొంగిపోయే వ్యక్తి ఆలోచనా విధానంపై ప్రభావం చూపుతాయి.

•••

బర్త్ డే పార్టీ అని వెళ్లిన కూతురు సోనీ (పేరు మార్చడమైనది) రాత్రి నుంచి ఇంటికి రాలేదు. ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వస్తోంది. తన స్నేహితులను కనుక్కుంటే తెలియదనే సమాధానం వచ్చింది. మూడు నెలలుగా సోనీ ప్రవర్తనలో వచ్చిన మార్పులు అమ్మను తెగ భయపెడుతున్నాయి. ఇదే విషయమై భర్తతో చెప్పింది. సోనీ వారికి ఒక్కతే కూతురు. అడిగినవన్నీ అమర్చిపెట్టగలిగే స్థోమత గల కుటుంబం.

సోనీ బీటెక్ సెకండియర్ చదువుతోంది. ఇంటర్మీడియెట్ వరకు ఇంట్లో ఎంత చెబితే అంత అన్నట్టుగా ఉన్న అమ్మాయి ఒక్కసారిగా ఫ్రెండ్స్ బర్త్ డే అనీ, గెట్ టుగెదర్ అనీ, కాలేజీ ఫ్రెషర్స్ డే అనీ, ఫేర్వెల్ అనీ... ఈ మధ్య పార్టీలు బాగా పెరిగిపోయాయి. పార్టీ అన్నప్పుడల్లా డబ్బులు ఇవ్వక తప్పేది కాదు. ఆమె రావడం ఆలస్యం కావడంతో ఓరోజు ఆమె ఫ్రెండ్స్ ద్వారా ఎంక్వైరీ చేసి, తను ఎక్కడ ఉందో తెలుసుకొని వెతుక్కుంటూ అక్కడికి వెళ్లారు.


ప్రతీకాత్మక చిత్రం

కృత్రిమ ఆనందం

- డ్రగ్స్‌కు అలవాటు పడితే ఏం చెప్పినా వినరు. డబ్బులు ఇవ్వకపోతే దొంగతనం చేయడం, పెద్దవాళ్ల మీద చేయి చేసుకోవడం, ఇంకా చేయకూడని పనులు చేసి ఎలాగైనా సరే డ్రగ్స్ తీసుకుంటారు.
- వాళ్లకి వాళ్ల డ్రగ్స్‌కి మధ్యన ఎవరు వచ్చినా భరించరు. అంటే.. తల్లి, తండ్రీ, స్నేహితులు... ఎవ్వరొచ్చినా తట్టుకోలేరు.
- యూత్‌కి బాగా నచ్చే పదాలు 'కొత్తదనాన్ని ఎక్స్‌పీరియెన్స్ చేయాలి.' దీనివల్లే ప్రతీ డ్రగ్ ని ఎక్స్‌పీరియన్స్ చేయాలనే క్యూరియాసిటీతో వాటిని టేస్ట్ చేస్తారు. ఆ సమయంలో కలిగే 'కృత్రిమ ఆనందం' మళ్లీ మళ్లీ మరింత మత్తు కావాలని కోరుకుంటుంది. దీంతో మోతాదు పెరుగుతుంటుంది.

అక్కడ సోనీ ఉన్న తీరును చూసి తల్లీతండ్రి షాకయ్యారు.

మరో నలుగురు అమ్మాయిలు, అబ్బాయిలు ఉన్నారు. మత్తులో ఉన్నట్టుగా కనిపిస్తున్నారు. అడిగిన దానికి ఎవరూ సరిగా సమాధానం చెప్పడం లేదు. వారి చుట్టూ ఉన్న వాతావరణం, వారి వాలకం చూడగానే అర్థమైపోయింది పిల్లలు ఎలాంటి స్థితిలో ఉన్నారో.

•••

సోనీని బలవంతంగా ఇంటికి తీసుకువచ్చారు.

నిద్రలేచి, ఫ్రెష్ అయి మళ్లీ బయటకు వెళ్లబోతున్న సోనీని ఆపింది తల్లి.

'బయట కాలు పెడితే ఊరుకోను, ఇంట్లోనే ఉండు' అని గద్దించాడు తండ్రి. .

'నన్ను ఆపడానికి మీరెవరు.. నా ఫ్రీడమ్‌ను ఎందుకు చంపేస్తున్నారు. ఏం చేస్తారో చేసుకోండి. నేను వెళతాను..' అని తండ్రి మీద రివర్స్ అయిపోయి బయటకు వెళ్లిపోయింది.

ఇక అలాగే వదిలేస్తే కూతురు దక్కదనుకున్నారు తల్లీదండ్రీ.

ఇలాంటి పరిస్థితులను ఎదుర్కొనేంత దూరం సమస్యను తీసుకెళ్లకుండా మొదట్లోనే సరైన పరిష్కారం దిశగా అడుగులు వేయడం, నిపుణుల సలహాలు పాటించడం మేలు.

సైకిక్ ఎనర్జీ

'నా జీవితం ఇది. నాకు చెప్పడానికి నీవెవరు? కన్నావు కాబట్టి భరించాల్సిందే' అంటారు. పరువు, ప్రతిష్ఠ, చదువు, కెరియర్.. దేనికీ వాల్యూ ఇవ్వరు. సైకిక్‌లా ప్రవర్తిస్తారు. ఇందులో అబ్బాయిలు/అమ్మాయిలు ఇద్దరూ ఉన్నారు. ఇది డ్రగ్ ఎడిక్షన్ పర్యవసానం అనే నిజాన్ని కుటుంబ సభ్యులు జీర్ణం చేసుకోలేకపోతున్నాయి. మా పిల్లలు అలాంటివారు కాదు అనుకొని సమాధాన పరుచుకుంటారు.

కౌన్సెలింగ్ తప్పనిసరి

తాము ముందు అనుకున్న లక్ష్యాలను పక్కన పెట్టేసి, ఇలాంటి వాటికి పిల్లలు అట్రాక్ట్ అవుతుంటారు. అందుకని, అమ్మాయి/అబ్బాయి ఎవరైనా సరే మత్తు పదార్థాలకు సంబంధించిన ప్రతీ సిచ్యుయేషన్ ని డిస్కస్ చేయాల్సిందే. 'మా అమ్మాయి/అబ్బాయి ఇలా చేస్తుంటే పదిమందికి ఏమని చెప్పుకుంటాం. ఈ సమస్యకు ఎవరి దగ్గరకు వెళ్లాలో కూడా తెలియడం లేదు' అని కుమిలిపోతుంటారు. దీనికి సరైన పరిష్కారం సైకలాజికల్ కౌన్సెలింగ్.

– నిర్మలారెడ్డి

అనుమానించాల్సిందే!

పిల్లల కొన్ని చర్యల వల్ల వాళ్ళు డ్రగ్ అడిక్ట్ అవునా కాదా సులువుగా తెలుసుకోవచ్చు.

- ఎక్కువ డబ్బులు కావాలని అడుగుతుంటారు. తరచూ పార్టీలకు వెళ్లడం, నా రూమ్‌లోకి ఎవరూ రావద్దు ... అని ఐసోలేట్ అవుతుంటారు. రెబల్స్ అవుతారు/రివర్స్ అవుతారు. పగటిపూట పడుకోవడం, రాత్రిళ్లు మేల్కొవడం చేస్తుంటారు. పెదవులు ఆరిపోవడం, చూపులో తేడా రావడంతోపాటు, వారి బాడీ లాంగ్వేజ్‌లోనూ మార్పులు వస్తాయి. ఇంట్లోకి వచ్చిన వెంటనే రూమ్‌లోకి వెళ్లి, తలుపులు వేసేసుకున్నా, నాకు వేరే పని ఉంది, నేను ఇప్పుడే రాను.. లాంటి మాటలు మాట్లాడుతున్నా అనుమానించాల్సిందే. చదువు విషయంలో సరిగ్గా లేకున్నా చెక్ చేయాలి. సరైన గైడెన్స్ ఇప్పించాలి. ఎక్కడైనా తేడా వస్తే.. థెరపిస్ట్ దగ్గరకు తీసుకెళ్లాలి.
- నా జీవితం, నా స్వేచ్ఛ అనే భావన అమ్మాయిలకు/అబ్బాయిలకు వచ్చేసింది. కానీ, స్వేచ్ఛ ఎంత ఇవ్వాలో దానికో పరిమితి ఉండాలి. ఏడాది, రెండేళ్ల పిల్లలు వెలుగుతున్న క్యాండిల్‌ను పట్టుకోవడానికి ఉత్సాహం చూపుతారు. కాలుతుందని మనకు తెలుసు, ఆ పిల్లవాడికి తెలియదు. అలాంటప్పుడు మనం ఎలా ఆపుతామో, ఇదీ అంతే అని గుర్తించాలి. నా పిల్లలను నేను కంట్రోల్ చేయాల్సిందే.. అనుకున్నప్పుడు మానిటర్ చేయాల్సిందే. అందుకు తగిన సపోర్ట్ తీసుకోవాల్సిందే.
- మంచి జీవనశైలి గురించి చెబితే ఎవరూ వినరు. వారి ఆలోచనా విధానమే మారాలి. ఎప్పుడూ మోటివేట్ చేసుకుంటూ వెళ్లాలి. అప్పుడు మంచి ఫలితం వస్తుంది. శారీరకంగా దెబ్బతినడం, కెరియర్ పాడవడం, సామాజికంగా చెడు పేరు రావడం ఇలాంటివన్నీ సమస్యలే కాబట్టి ఆలోచనా విధానాన్ని మార్చేటట్టు చేయాలి. అయితే, ఆలోచనా విధానం మారడానికి మందులు ఉండవు. ఉదాహరణకు.. ఐస్‌క్రీమ్ తింటే పడటం లేదు అంటే, తినడం మానేయాలి, తప్పదు. అలాగే, మనకు చెడు చేసేవి ఏవైనా వదిలేయాల్సిందే.
- మత్తు పూర్తిగా వదిలించుకోవాలంటే అది ఆ వ్యక్తిని బట్టి ఉంటుంది. మారాలనే ఆలోచన బట్టి రికవరీ వేగంగా ఉంటుంది. 'డ్రగ్స్ వల్ల నాకు డ్యామేజీ అవుతుంది అనుకున్నప్పుడు పరిష్కారాన్ని వెతుక్కోవాలి అనిపిస్తుంది. ఆల్కహాల్/డ్రగ్స్ తీసుకుంటే బాడీ వెంటనే రియాక్ట్ అవుతుంది. ఒక్కసారిగా మానేసినా అంతే రియాక్ట్ అవుతుంది. అందుకని, డిటాక్స్ అండ్ విత్‌డ్రాయల్ మేనేజ్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. మత్తుకు అలవాటుపడటం ఒక రోగం అని గుర్తించాలి. దాని మీద ఒక అవగాహన ఏర్పరుచుకోవడం, పర్సనాలిటీ డెవలప్‌మెంట్ కౌన్సెలింగ్ విధానాల ద్వారా దాన్ని అధిగమించాలి.



– డాక్టర్ గిడియన్, డి–అడిక్షన్ థెరపిస్ట్
లివింగ్ సోబర్, హైదరాబాద్

న్యూస్‌మేకర్


సాజ్రి

మరో స్వర్ణకమలం

సంప్రదాయ నృత్యమంటే ఇష్టం లేని అమ్మాయిని ఆ నృత్యంలో లగ్నం చేసే సినిమా కథ 'స్వర్ణకమలం'. కేరళలో ఇందుకు పూర్తి విరుద్ధమైన కథ జరిగింది. మదరసాలో చదువుకునే ఒక అమ్మాయి కథాకళి పట్ల ఆసక్తితో 80 ఏళ్ల చరిత్ర ఉన్న డాన్స్ స్కూల్‌లో పోరాడి సీటు సాధించుకుంది. కథాకళిలో ముస్లిం అమ్మాయిల ప్రవేశం ఇప్పటి వరకూ లేదు. ఆ నృత్యం నేర్చుకుంటున్న మొదటి అమ్మాయి సాబ్రి.

'చిన్నప్పటి నుంచి కథాకళి చూస్తున్నా. దానికి వేసుకునే మేకప్, దాని కాస్ట్యూమ్స్, ఆ నృత్యవిధానం నన్ను ఆకర్షించాయి. ఎలాగైనా ఆ డాన్స్ నేర్చుకోవాలని చెప్పా. నాన్నకు కూడా ఆ డాన్స్ ఇష్టం. సరే నమ్మా అన్నాడు' అంది సాబ్రి.

ఏడవ క్లాసు పూర్తి చేసిన సాబ్రి ఇప్పుడు తండ్రి నిస్సమ్, తల్లి అనీషాల ప్రోత్సాహంతో కథాకళి నృత్యం నేర్చుకోవడానికి పూనుకుంది. కేరళలోనే కాదు బహుశా దేశంలోనే కథాకళి నేర్చుకుంటున్న తొలి ముస్లిం బాలిక సాబ్రి. అందుకే ఈ అమ్మాయిని అందరూ మెచ్చుకుంటున్నారు. కళకు కులం, మతం భేదం లేదని అంటున్నారు.


డ్యాన్స్ స్కూల్ 'కళామండలం' వద్ద సాబ్రి


డ్యాన్స్ క్లాస్‌లో ...

■ దేవుని గుడిలో చూసి..

సాబ్రి కుటుంబం కొల్లంలో నివసిస్తుంది. తండ్రి నిస్సమ్ ప్రొఫెషనల్ ఫొటోగ్రాఫర్. వీరి ఇంటి సమీపంలోనే శ్రీ మహదేవ కోవెల ఉంది. అక్కడ దాదాపు ప్రతి వారం ఏదో ఒక సాయంత్రం కథాకళి నృత్య ప్రదర్శన ఉంటుంది. వృత్తిలో భాగంగా నిస్సమ్ ఆ నృత్య ప్రదర్శన ఫొటోలు తీయడానికి వెళ్లేవాడు. కాలక్షేపంగా ఉంటుందని సాబ్రిని కూడా తీసుకెళ్లేవాడు. 'అలా ఏడేళ్ల వయసు నుంచే నేను కథాకళి నృత్యాన్ని చూస్తున్నాను. ఐదో క్లాసు అయ్యాక ఆ డాన్సును ప్రయివేటు టీచర్ దగ్గరి నుంచి నేర్చుకోవాలనుకున్నాను. కాని కోవిడ్ వల్ల క్లాసులు ఆగిపోయాయి. అదీగాక ఒక ఇన్‌స్టిట్యూట్ నుంచి పరిపూర్ణంగా నేర్చుకోవాలనిపించింది. అందుకే కళామండలంలో చేరాను' అంది సాబ్రి.

■ మగవారికే కథాకళి

కథాకళి నృత్యం ఒక తపస్సు. దాని కోసం జీవితాన్ని అంకితం చేయాలి. స్త్రీల శరీర ధర్మాలు, గృహ ధర్మాలు వారిని పరిపూర్ణంగా ఈ నృత్యంలో నిమగ్నం కాని వ్వవు అనే ఉద్దేశ్యంతో ఈ నృత్యాన్ని ఆది నుంచి పురుషులకే పరిమితం చేశారు. పురుష కళాకారులే కథాకళిలోని స్త్రీల వేషాలను కూడా ధరిస్తారు. ప్రదర్శనను రక్తి కట్టిస్తారు. కథాకళిని పరిరక్షించడానికి కేరళలో ప్రతిష్ఠాత్మకమైన డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌లు ఉన్నాయి. అలాంటి వాటిలో ముఖ్యమైనది త్రిసూర్‌కు దగ్గరగా ఉన్న చెరుతురితి అనే ఊరిలోని 'కళామండలం'. ఇది కథాకళిని బాల్యం నుంచి రెసిడెన్షియల్ పద్ధతిలో నేర్పుతుంది. అంటే ఇక్కడ మామూలు స్కూలు, కథాకళి స్కూలు కలిసి నడుస్తాయి. 90 ఏళ్లుగా నడుస్తున్న ఈ సంస్థలో పూర్తిగా అబ్బాయిలకే ప్రవేశం. అయితే గత సంవత్సరమే అమ్మాయిలు కూడా చేరొచ్చు అని అనుమతి ఇచ్చారు. ఎవరూ చేరలేదు. ఈ సంవత్సరం పది మంది అమ్మాయిలు చేరితే వారిలో ఒకమ్మాయి సాబ్రి.

■ కఠిన శిక్షణ

కళామండలంలో 8 వతరగతిలో చేరిన సాబ్రి ఇక అక్కడే హాస్టల్‌లో ఉండిపోవాలి. ఉదయం 4.30 నుంచి లేచి కథాకళి పాఠాలు నేర్చుకోవాలి. 9.30 నుంచి మళ్లీ స్కూలు పాఠాలు నేర్చుకోవాలి. సాయంత్రం ఊళ్లో ఎక్కడ కథాకళి ప్రదర్శన జరుగుతుంటే అక్కడకు తీసుకెళ్లి చూపిస్తారు. 'కథాకళిలోని ప్రదర్శనలన్నీ హిందూ పురాణాల ఆధారంగా ఉంటాయి. మరి నీకు ఆ పాత్రలు పోషించడంలో ఇబ్బంది ఏమీ లేదా' అంటే 'అలా ఏమీ లేదు' అంటుంది సాబ్రి. తండ్రి నిస్సమ్ కూడా 'మా అమ్మాయి డాన్స్ నేర్చుకోవడంలో కళ అందరూ నేర్చుకునే హక్కు నిరూపితం అయ్యింది. ఈ నృత్యం నేర్చుకోవడంలో మా మతస్తుల నుంచి ఎటువంటి అభ్యంతరం లేదు' అని తెలిపాడు.

పద్నాలుగేళ్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్!

నాలుగైదేళ్లొచ్చినా ఇంకా ముద్దు ముద్దుగా మాట్లాడే పిల్లలే మనకు తెలుసు. అలాంటిది రెండేళ్లకే గలగల మాట్లాడుతూ అందరూ ఆశ్చర్యపోయేలా చేశాడా బుడతడు. అంతేనా? తొమ్మిదో ఏటనే "నాది స్కూలు సిలబస్ చదివి, హోం వర్క్ చేసే వయసు కాదు" అని చెప్పి ఏకంగా కాలేజీ పుస్తకాలు చేతబట్టాడు. నాలుగేళ్లలో చకచకా డిగ్రీ పూర్తి చేసేశాడు. ప్రస్తుతం పద్నాలుగేళ్ల వయసులో ఎలాన్ మస్క్ కంపెనీలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా హార్డ్‌గా పని చేస్తున్నాడు కైరాన్ క్వాజీ.


కైరాన్ క్వాజీ

నేటి టెక్నాలజీ టీనేజర్స్ కొందరు అది ఇది అనిచెబుతూ ఎంజాయ్ చేస్తూ సమయాన్ని వృథా చేస్తుంటే.. కైరాన్‌లాంటి కుర్రాళ్లు మాత్రం వయసుకు మించిన ప్రతిభతో అద్భుతాలు సృష్టిస్తూ ఔరా అనిపిస్తున్నారు. అత్యంత వేగం, కచ్చితత్వంతో కూడిన ప్రతిభా పాటవాలతో ప్రఖ్యాత స్పేస్ ఎక్స్ కంపెనీ రిక్రూట్‌మెంట్ టెస్ట్ పాసైన కైరాన్ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికవడమేగాక, కంపెనీలోనే తొలి అతిపిన్న ఇంజినీర్‌గా నిలిచాడు.

అమెరికాలోని శాన్ ఫ్రాన్సిస్కోకు చెందిన జూలియా, ముస్తాహిద్ క్వాజీ దంపతులకు 2009 జనవరి 27 కైరాన్ పుట్టాడు. చిన్నప్పటి నుంచి ఎంతో చురుకుగా ఉత్సాహంగా ఉండే కైరాన్‌ను గమనించిన తల్లిదండ్రులు.. చక్కగా ప్రోత్సహించేవారు. తెలివిగా చదువుతూ ..ఏడో ఏట యంగ్‌వాంక్స్ కోడింగ్ అకాడమిలో చేరి పైథాన్ ప్రోగ్రామింగ్‌ను నేర్చుకున్నాడు. దీంతోపాటు మెషిన్ లెర్నింగ్‌ను కూడా వంటబట్టించుకున్నాడు.


విధి నిర్వహణలో క్వాజీ


తల్లిదండ్రులతో...

తొమ్మిదేళ్లకే కాలేజీ..

నాది స్కూల్ హోం వర్క్ చేసే వయసు కాదని తన ప్రతిభతో తొమ్మిదో ఏటనే లాస్‌పాసిటాస్ కాలేజీలో చేరి ఈ కాలేజీ చరిత్రలో తొలి పిన్న వయసు విద్యార్థిగా చరిత్ర సృష్టించాడు. ఆ తరువాత పదకొండేళ్లకే మ్యాథమేటిక్స్‌లో డిగ్రీ చదువుతూనే శాంత క్లారా యూనివర్శిటీలో కంప్యూటర్ ఇంజినీరింగ్ కూడా చదివాడు. ఇదే యూనివర్శిటీలో ఏడాది మాస్టర్స్‌ని పూర్తిచేశాడు. ఇటీవల సాంకేతిక ఫన్ ఇంటర్వ్యూ ప్రాసెస్‌ను అవలీలగా అధిగమించి స్పేస్‌ఎక్స్‌లోని స్టార్‌లింక్ విభాగంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా ఎంపికయ్యాడు. దేన్నైనా ఇట్టే పట్టేసే గుణగణాలే కైరాన్‌ని స్పేస్ ఎక్స్ ఉద్యోగిగా మార్చాయి. అందుకే చిన్న వయసులో డిగ్రీలేగాదు, ఉద్యోగాన్ని కూడా కొట్టేశాడు.

ప్రతిభ, పట్టుదల, కృషి ఎక్కువ

''కైరాన్ చిన్నప్పటి నుంచి చాలా చురుకుగా ఉండేవాడు. అ చురుకుదనాన్ని వెన్నుతట్టి ప్రోత్సహించేవాళ్లం. దాంతో వాడు తన ప్రతిభాపాటవాలకు మరింత పదును పెట్టుకుని టీనేజ్‌లోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా మారాడు. లాస్‌పాసిటాస్ కాలేజీలో చదివేటప్పుడు అకడమిక్ సిలబస్‌ను నేర్చుకోవడమేగాక, స్టాఫ్ అసిస్టెంట్‌గా, స్టెమ్ ట్యూటర్‌గాను పనిచేసేవాడు. ఇతర ట్యూటర్‌లకు సాయం చేస్తూ తన నైపుణ్యాలను మెరుగుపరుచుకున్నాడు. వేసవి సెలవుల్లో సైబర్ ఇంటిలిజెన్స్ ఇంటర్న్‌షిప్ చేశాడు. దీనితోపాటు బ్లాక్‌బర్డ్ ఏఐలో కూడా ఏఐ ఇంటర్న్‌గా చేశాడు. శాంతక్లారా యూనివర్సిటీ, ఇంటెల్ మెంటర్స్ కూడా కైరాన్‌కు మంచి గైడెన్స్‌ను అందించారు. చేతిరాత, స్పెల్లింగ్, నోట్ టేకింగ్, ఇతర భాషలు నేర్చుకోవడం కాస్త కష్టమైనా.. పట్టుదల, కృషితో నేర్చుకున్నాడు. ప్రస్తుతం బెంగాలీ, మాండరిన్ నేర్చుకుంటున్నాడు. ఎప్పుడు కొత్తదాన్ని నేర్చుకోవడానికి కైరాన్ ఆసక్తి కనబరుస్తాడు. ఆ ఆసక్తే వాడి భవిష్యత్తుని ఉజ్వలంగా తీర్చిదిద్దుతోంది'' అని కైరా తల్లిదండ్రులు చెప్పుకొచ్చారు.

ది బాస్ లేడీ

నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా (ఎన్‌ఎస్‌డీ) స్టూడెంట్ అయిన ఆష్క గొరాదియకు బాలీవుడ్‌లో బ్రేక్ రాలేదు. అయితే ఆ అసంతృప్తి ఆమె మాటల్లో ఎప్పుడూ తొంగి చూసేది కాదు. ప్రతి అడుగులో ఆత్మవిశ్వాసం కనిపించేది. ఆ ఆత్మవిశ్వాసమే ఆమెను వ్యాపార రంగం వైపు నడిపించింది. 'రెనీ కాస్మెటిక్స్'తో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఘనవిజయాన్ని సాధించింది...


ఆష్క గొరాదియ

బాల నటిగా కెరీర్ మొదలు పెట్టింది ఆష్క గొరాదియ. తన ప్రయాణంలో రకరకాల సవాళ్లు, కష్టాలు ఎదురైనా వెనక్కి తగ్గలేదు. వాటివల్ల పోరాటం ఎలా చేయాలో తనకు తెలిసింది. హిందీ సినిమాల్లో నటిస్తున్న కాలంలోనే హాలీవుడ్ కలలతో అమెరికా వెళ్లింది. అక్కడ పెద్దగా అవకాశాలు రాకపోవడంతో తిరిగి ఇండియాకు వచ్చింది.

బాలీవుడ్ సినిమాల్లో చిన్న చిన్న పాత్రలు చేసి, ఎన్నో టీవి సీరియల్స్‌లో నటించి 'టీవి స్టార్'గా పేరు తెచ్చుకున్న ఆష్క ఎంటర్‌ప్రెన్యూర్‌గా ప్రయాణం మొదలుపెట్టాలనుకుంది. అయితే అది అంత తేలిక కాదనేది తనకు తెలియని విషయమేమీ కాదు. తన కళ్ల ముందే ఎన్నో అనుభవాలు ఉన్నాయి. అయితే అవేమీ తనకు అడ్డు కాలేదు. మొదటి అడుగుగా సొంతంగా ప్రొడక్షన్ కంపెనీ మొదలుపెట్టిన ఆష్క ఎన్నో సక్సెస్‌ఫుల్ టీవీ షోలు చేసింది. ఆ తరువాత ట్రావెలర్స్ కోసం ఒక మొబైల్ యాప్ వెంచర్‌ను లాంచ్ చేసింది. ఆ తరువాత స్నేహితులతో కలిసి ప్రారంభించిన 'రెనీ కాస్మెటిక్స్' ఆమెను స్టార్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా మార్చింది.

ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఆష్క ఘనవిజయం ఎంతోమంది ఔత్సాహికులకు స్ఫూర్తి ఇచ్చింది. ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణించాలనుకునే వారికి ఆమె చెప్పిన కొన్ని సలహాలు...

కల కనాలి... ముందుకు కదలాలి: ఒకరి నుంచి స్ఫూర్తి పొందిన తరువాత కల శ్రీకారం చుట్టుకుంటుంది. అయితే అది సాకారం కావాలంటే ఆచరణలోకి రావాలి. పనికి సంబంధించి స్థాయిని పెంచుకుంటూ పోవాలి.

అంకితభావం ప్లస్ కష్టం: నటన అయినా వ్యాపారమైనా సక్సెస్ కావాలంటే అంకితభావంతో పాటు బాగా కష్టపడాలి. ఒకవేళ విజయం సాధించకపోయినా మనం కన్న కలకు దూరం కావద్దు. ఓటమి నేర్పే పాఠాలతో ముందుకు వెళ్లాలి. సానుకూల ఆలోచనలకు ప్రాధాన్యత ఇవ్వాలి.

రిస్క్‌కు భయపడితే రిస్క్: ఈతకొట్టడానికి నీళ్లలోకి దిగిన తరువాత నీళ్లకు భయపడితే ఎలా! వ్యాపారం అన్నాక రిస్క్ ఉంటుంది. అంత మాత్రాన వెనక్కి తగ్గనవసరం లేదు. మూస ఆలోచనలకు భిన్నంగా కొత్తగా ఆలోచిస్తే విజయం మన చెంతకు నడిచొస్తుంది.

కోవిడ్ కల్లోల సమయంలో ఎన్నో వ్యాపారాలలాగే మా వ్యాపారం కూడా దెబ్బతింది. 'ఇక నీకు నటనే దిక్కు' అనేవాళ్లు. అయితే నేనెప్పుడూ నమ్మకం కోల్పోలేదు. మంచిరోజులు వస్తాయని గట్టిగా నమ్మాను. అది నిజమైంది.

నెట్‌వర్క్: నటనకైనా, వ్యాపారానికైనా పదిమందితో పరిచయం ముఖ్యం. ఈవెంట్స్, వర్క్‌షాప్‌లకు హాజరుకావడంతో పాటు ఆన్‌లైన్ కమ్యూనిటీలతో టచ్‌లో ఉండాలి. సామాజిక సంబంధాల ద్వారా కొత్త విషయాలు తెలుస్తాయి. ఆలోచన పరిధి విస్తరిస్తుంది. ముందుకు వెళ్లడానికి కావాల్సిన ధైర్యం లభిస్తుంది.

యుఎస్పీ: 'మా బ్రాండ్ ఇది' అని మాత్రమే కాదు 'మా యూఎస్పీ ఇది' అని గర్వంగా చెప్పుకోగలగాలి. మా బ్రాండ్ విషయానికి వస్తే హై–క్వాలిటీ, గతంలో ఎప్పుడూ చూడని ప్యాకేజీ, పాకెట్–ఫ్రెండ్లీ ప్రైస్ అనేవి మా యూఎస్పీ. మార్కెట్ ప్లేస్‌లకు వెళుతూ ఎప్పటికప్పుడు ట్రెండ్స్ తెలుసుకోవాలి.

ఆష్కకు నటన, యోగా, పోల్ డ్యాన్స్, ట్రావెల్ అంటే ఇష్టం. ఇక ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ అనేది వాటికంటే రెండు రెట్లు ఎక్కువ ఇష్టమైనది. సినిమాలు, టీవీ సీరియల్స్‌లో ఆష్క 'బిజినెస్ ఉమన్' పాత్ర ధరించలేదు. అయితే నిజ జీవితంలో మాత్రం ఆమె 'బిజినెస్ ఉమన్'గా అద్భుత విజయాన్ని సాధించింది. 'ది బాస్ లేడీ' అని స్నేహితులతో పిలిపించుకుంటోంది.



"నా నెక్స్ట్ స్టాప్ స్పేస్‌ఎక్స్: ఈ గ్రహంలోనే అత్యంత చక్కని కంపెనీలో స్టార్‌లింక్ ఇంజినీరింగ్ టీమ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా చేరబోతున్నాను. వయసును బట్టి ఉద్యోగాలలో నియమించే కంపెనీలకు భిన్నంగా. నా ప్రతిభ, పరిపక్వతలను దృష్టిలో పెట్టుకుని స్పేస్‌ఎక్స్ నాకు ఈ ఉద్యోగం ఇచ్చింది" అని తన లింక్డ్ ఇన్ అకౌంట్ ద్వారా కైరాన్ తన కలల జాబ్ గురించి సంతోషంతో చెప్పుకున్నాడు.